ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌కు ప్రత్యేకాధికారిగా జేసీ

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ది నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలకు ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బీ రాజశేర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఆరు నెలల కాలానికి ప్రత్యేకాధికారిగా నియమించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌డీసీఎంఎస్, ఎన్‌డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్లు రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం జాయింట్ కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడం విశేషం.



ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో కబ్జాకు గురైన భూమి ఇదే!

2023, నవంబరు 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన విలువైన భూమి పేదల ముసుగులో వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయిందని కథనాన్ని ప్రచురించింది. ఈ కబ్జా పర్వంపై అధికారులు స్పందించినట్లు నటించారు. ఈ భూమి అన్యాక్రాంతం కావడానికి వీల్లేదన్నారు. చర్యలు తీసుకుంటామన్నారు. చివరకు అవన్నీ ఒట్టి మాటలే. అధికారంలో ఉన్న వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు నిజాలకు పాతరేశారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు వదిలిపెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా సహస్ర లింగేశ్వరస్వామి భూమికి అక్రమార్కుల చెర నుంచి విముక్తి లభిస్తుందా!? లేదా!? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



గతేడాది నవంబరు 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

సహస్ర లింగేశ్వరా..

నీ భూమిని నువ్వే కాపాడుకో!

- పత్రికలు ఘోషించినా స్పందించని యంత్రాంగం
- ఫోర్జరీ పట్టాలతో రూ.5 కోట్ల స్థలం కబ్జా
- తెరవెనుక వైసీపీ నేతల హస్తం
- అధికారం అండతో విచారణ ఫైలు బుట్టదాఖలు
- విక్రయ పత్రాల్లో వైసీపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుల పేర్లు
- టీడీపీ పాలనలోనైనా న్యాయం జరిగేనా!?

జరిగిన కథ ఇది

2022, ఫిబ్రవరి. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని గచ్చుకాలువ విస్తరణ పనులు మొదలయ్యాయి. ఈ కాలువ మీద కాపురం ఉంటున్న పేదలకు పునరావాసం చూపించాలన్న ఉద్దేశంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం 41వ డివిజన్‌లోని ఇరగాళమ్మ సంఘం ప్రాంతంలో సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 0.85 సెంట్ల భూమిని ఎంచుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆరు అంకణాలు చొప్పున 47 ప్లాట్లు వేశారు. గచ్చుకాలువ మీద ఉన్న 12 మంది పేదలకు పట్టాలు సిద్ధం చేశారు. అయితే ఆ పేదలు గచ్చుకాలువ ప్రాంతాన్ని వదిలి ఇక్కడికి రావడానికి ఇష్టపడలేదు. పట్టాలు తీసుకున్న కొందరు కూడా తిరిగి ఇచ్చేశారు. కొంతకాలం సదరు భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉండిపోయింది.

2023లో..

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీని వదిలి టీడీపీలో చేరడంతో రూరల్ ఇన్‌చార్జిగా ఆదాల ప్రభాకరరెడ్డిని నియమించారు. సరిగ్గా అప్పుడే ఈ భూమిని దిగమింగే కుట్రకు తెరలేచింది. ఆదాల అనుచరులుగా ముద్రపడ్డ కొంతమంది వైసీపీ నాయకులు ఫోర్జరీ పట్టాలతో స్వాహా చేయడానికి ప్రయత్నించారు. ఈ అక్రమార్కుల్లో స్థానిక వైసీపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు తహసీల్దారు ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించారు. ఆరు అంకణాలుగా ఉన్న ప్లాట్లను 36 అంకణాల బిట్లుగా తయారు చేసి కార్పొరేషన్‌లో వాటికి వేకెంట్‌ల్యాండ్ పన్ను వేయించుకున్నారు. దానిని ఆధారంగా చూపి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకున్నారు. విక్రయించిన వారిలో స్థానిక కార్పొరేటర్ కుటుంబ సభ్యులు కూడా ఉండటం గమనార్హం.

స్పందించినట్లు నటించిన అధికారులు

ఈ అక్రమాన్ని అప్పట్లోనే ఆంధ్రజ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించినట్లు నటించారు. ప్రభుత్వ స్థలాన్ని, అందునా పేదల కోసం కేటాయించిన స్థలాన్ని ఎలా రిజిస్టర్ చేస్తారో అర్థం కావడం లేదని నటించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షిస్తామని ప్రకటించారు. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భూమి అక్రమార్కుల పేరుమీదే భద్రంగా ఉంది.

ఇప్పుడైనా స్పందిస్తారా!?

ప్రభుత్వ భూమికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వేయడం కార్పొరేషన్ అధికారుల తప్పు. రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా రిజిస్టర్ చేయడం రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తప్పు. వీటన్నిటికన్నా ముఖ్యంగా ప్రభుత్వ భూమికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయకపోవడం ఇంకా పెద్ద తప్పు. అధికారులు వైసీపీ నాయకుల పెత్తనానికి లొంగకుండా వ్యవహరించి ఉంటే తొలుత చేయాల్సిన పని ప్రభుత్వ భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. వెంకటగిరిలో సహకార డెయిరీ భూమిని ఇలాగే మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అప్పటి గూడూరు సబ్ కలెక్టర్ రోజుల వ్యవధిలో ఆ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయడంతో పాటు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. నిజంగా అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇదివరకెప్పుడో ఈ భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్లు రద్దు చేసి ఉండేవారు. అలా చేయకపోగా, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా వైసీపీ నాయకుల అక్రమాలను చూసీచూడనట్లు వదిలేశారు. అక్రమార్కులేమో పత్రాలను చేతపట్టుకొని భూమి తమదేనంటూ దర్జాగా తిరుగుతున్నారు.

ఎమ్మెల్యే గారూ స్పందించండి!

పరులపాలైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే విషయంలో స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవ చూపాలని ఇరుగాళమ్మ సంఘం పరిసర ప్రాంత పేదలు కోరుతున్నారు. ఈ అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సుమారు రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయించి ఈ భూమిని స్థానిక పేదల కోసమో, ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని కోరుతున్నారు.

బుచ్చిలో భారీ చోరీ

- తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు
- 40 సవర్ల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణ
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ పరిశీలన



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27 : బుచ్చిరెడ్డిపాళెంలోని బ్రాహ్మణవీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి 40 సవర్ల బంగారు, రూ.3 లక్షల నగదు దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. బ్రాహ్మణవీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు పత్తిపాటి వెంగళరావు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి నర్రవాడలో వెంగమాంబ తిరునాళ్లకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు తొలుత ఇంటి బయట గేటుకున్న తాళం, ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బెడ్‌రూంలో బీరువాను పగలగొట్టి భారీగా నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నారు. బీరువాలో నుంచి తీసి బెడ్‌పై వేసిన చీరల మడతల్లోని కొన్ని ఆభరణాలు కనిపించక పోవడంతో వాటిని వదిలేశారు. ఆ తర్వాత ఇంటి వెనుక వైపు నుంచి వెళ్లిపోయారు.

● కుమార్తె పెళ్లి కోసం..

వెంగళరావు తన కుమార్తె శశి కోమలి పెళ్లి ప్రయత్నాల నిమిత్తం బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు ఇంట్లో భద్రపరిచారు. అలాగే బుధవారం అత్తామామలు ఇచ్చిన రూ.3 లక్షల నగదునూ ఇంట్లో ఉంచినట్లు బాధితులు తెలిపారు. నర్రవాడకు వెళ్లిన వెంగళరావు భార్య, కొడుకు, అత్తామామలు అక్కడే ఉండిపోగా కుమార్తెతో కలిసి వెంగళరావు గురువారం సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి ఉండటం, ఇంట్లో నగదు, నగలు చోరీకి గురైనట్లు గుర్తించి 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న నెల్లూరు సీసీఎస్ క్రైం అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ రామకృష్ణాచారి, సీఐ చిట్టెం కోటేశ్వరరావు, బుచ్చి సీఐ హైమారావు ఇంటిని పరిశీలించి, వివరాలు సేకరించారు. 40 సవర్ల బంగారం, రూ.3లక్షలు నగదు చోరీకి గురైనట్టు సీఐ తెలిపారు. క్లూస్‌టీం నిందితుల వేలిముద్రలు సేకరించగా, పోలీసు జాగిలం కూడా రోడ్డుమీదకు కొంతదూరం వచ్చి ఆగింది. ఈ చోరీని సవాల్‌గా తీసుకున్న పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు. అయితే, బాధితులు భారీగా నగదు, నగలు అపహరణకు గురైనట్లు వాపోయారు.

అనధికార పొగాకు బ్యారన్లు నిర్మించి నష్టపోవద్దు : ఆర్‌ఎం

కందుకూరు, జూన్ 27: పొగాకుకు ప్రస్తుతం లభిస్తున్న గిట్టుబాటు ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులు అనధికార పొగాకు బ్యారన్లు నిర్మించి నష్టపోవద్దని పొగాకుబోర్డు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు రైతులకు సూచించారు. గురువారం కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకు సూర, ముక్క వేలంను ఆయన ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల బయ్యర్లతో మాట్లాడుతూ సూర, ముక్కలకు మంచి ధర ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులు కూడా గతంలోలా సూర, ముక్క పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నాణ్యంగా బేళ్లు కట్టుకుని తీసుకురావాలన్నారు. అనధికారికంగా బ్యారన్లు నిర్మించటం, అధిక రేటుకు భూములు, బ్యారన్లను కౌలుకు తీసుకుంటే నష్టపోతారని హెచ్చరించారు. అనధికార బ్యారన్లు నిర్మించే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు సాగుచేసే భూముల్లో విధిగా పచ్చిరొట్ట పైర్లు వేసి 40రోజుల పైరుదశలో భూమిలో కలియదున్నాలని ఇలా చేయటం వల్ల నాణ్యమైన పొగాకు దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి, రైతుప్రతినిధులు ఉన్నారు.

ఐటీడీఏ పీవో మాతృశాఖకు బదిలీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 : నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా రాణిని విశాఖపట్నంలోని మాతృశాఖ అయిన టీసీఆర్ అండ్ టీఎంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిరిగి పంపారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలు ఆరోపణల నేపథ్యంలో మందరాణిపై జడ్పీ సీఈవో కన్నమ నాయుడును కలెక్టర్ హరినారాయణన్ విచారణాధికారిగా నియమించారు. కన్నమనాయుడు మంగళ, బుధవారాల్లో ఐటీడీఏ కార్యాల యంలో ఫైళ్ల తనిఖీతోపాటు ఫిర్యాదుదారుడైన గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యను విచారించారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ నేపథ్యంలో పీవో మందారాణిని మాతృశాఖకు పంపటం చర్చనీయాంశమైంది. కాగా, పీవో రాణి స్థానంలో డీటీడబ్ల్యూవో పరిమళను ఇన్‌చార్జిగా నియమించారు.

ఏపీ పీజీసెట్ ఫలితాల విడుదల

- జిల్లా విద్యార్థులకు ర్యాంకులు

నెల్లూరు (విద్య): రాష్ట్రంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 10 నుంచి 13వతేదీ వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలను గురువారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. పీజీసెట్ ద్వారా 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో 145కుపైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో నెల్లూరు దర్గామిట్టకు చెందిన పఠాన్ సాజిదాబేగం 2వ ర్యాంకు, సంస్కృతం విభాగంలో కపాడిపాళెంకు చెందిన ముత్యాల శివనాగమణి 3, హిందీ విభాగంలో నెల్లూరు పద్మావతిసెంటర్‌కు చెందిన సయ్యద్ సుమయ 4, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ విభాగంలో సీతారామపురానికి చెందిన బక్కా అశోక్‌రాజు 10, కామర్స్ విభాగంలో నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన చుండి సాయి కేశవ హరిప్రియ 10, ఎడ్యుకేషన్ విభాగంలో నవాబుపేటకు చెందిన బోయిన చైతన్య 9వ ర్యాంకు సాధించారు.

● ఏపీ ఎడ్‌సెట్‌లో..

బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష ఫలితాల్లోనూ జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించారు. మెథడాలజీ ఇంగ్లీష్ విభాగంలో వింజమూరుకు చెందిన చెన్నబోయిన వెంకట శ్రీహర్షిత 9వ ర్యాంకు, మేథమేటిక్స్‌లో టీపీగూడూరు మండలం ఇస్కపల్లికి చెందిన ఇంగిలేల శ్రీనివాస్ 6, ఫిజికల్ సైన్స్‌లో ఏఎస్‌పేట మండలం తాళ్లపాడుకు చెందిన లెక్కల కల్యాణి 7వ ర్యాంకు సాధించారు.

- ముగిసిన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- చివరి రోజున ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



గ్రామోత్సవంలో వెంగమాంబ, గురవయ్య నాయుడు దంపతులు



అగ్నిగుండంలో కొబ్బరి వేస్తున్న భక్తులు

అంబరాన్నంటిన సంబరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్); జూన్ 27 : నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఈ నెల 23న నిలుపుతో ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజుల పాటు వేడుకగా జరిగాయి. చివరి రోజు గురువారం వెంగమాంబ పేరంటాల దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామాల్లో ఊరేగారు. పేరంటాలను దర్శించుకొనేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. హోమగుండంలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకొన్నారు. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన వెంగమాంబ ప్రధానోత్సవం గురువారం మధ్యాహ్నం వరకు సాగింది. ఉత్సవాలు ముగింపు సందర్భంగా పచ్చవ వంశీయులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ సారె తీసుకొచ్చి అమ్మవారికి అందచేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్‌ఐ ఉమాశంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంగమాంబ సేవాసమితి, భక్తమండలి, ఆర్యవైశ్య సంఘం, పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

ఉత్సవాల్లో చివరిరోజున రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగాయి. పోటీలను తిలకించేందుకు వేలాది మందిగా తరలిరాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా గుంపరమానదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు ప్రథమ, కడప జిల్లా చౌటపల్లికి చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు ద్వితీయ, గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన చెందిన పులగం తిషగ్నారెడ్డి ఎద్దులు తృతీయ, ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కిన కోటేశ్వరరావు ఎద్దులు చతుర్థ, నంద్యాల జిల్లా మురాళ్లపల్లికి చెందిన పులి చినఓబులరెడ్డి ఎద్దులు 5, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎద్దులు 6, అనంతపురం జిల్లా తోపుదుర్తికి చెందిన చెన్నప్ప ఎద్దులు 7, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎద్దులు 8, బాపట్ల జిల్లా వేటపాళెం గ్రామానికి చెందిన శిరీషాచౌదరి 9వ స్థానంలో నిలిచి విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఉషశ్రీ, కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీఏలో ఆయనో అధికారి.. నియోజకవర్గ స్థాయిలో పనిచేసే ఓ ఏపీఎం కం ఏసీ.. తన పరిధి లోని మండలాల్లో ఎన్‌ఆర్‌ఈజీ ఎస్ పనుల పరిస్థితిని సమీక్షించడం ఆయన విధి. కానీ రాజకీయ నాయకుడి అవతారమెత్తాడు. వైసీపీకి వీరభక్తుడిగా పనిచేశారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం తన అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారు. సదరు ఏపీఎం వ్యవహారశైలిపై కొందరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఆదేశాలతో జరిగిన విచారణలో వాస్తవమని తేలినా ఇప్పటివరకు చర్యల్లేవు. ఆయనపై జిల్లా ఉన్నతాధికారులకు ఎందుకో అంత ప్రేమ అర్థం కావడం లేదంటూ ఆ శాఖలోనే చర్చించుకుంటుండటం గమనార్హం.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఆయనపై ఎందుకో అంత ప్రేమ!

- వైసీపీ వీరభక్తుడిగా డీఆర్డీఏ అధికారి
- ఉదయగిరిలో అన్నీ తానై వ్యవహరించిన వైనం
- ఎన్నికల కమిషన్‌కు పలువురు ఫిర్యాదు
- ఆరోపణలు నిజమని తేల్చిన జడ్పీ సీఈవో
- అయినా చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు



ఉదయగిరి ప్రాంతంలో పనిచేసే ఓ డీఆర్డీఏ ఏపీఎం పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఆయన సాగించిన హవా అంతా ఇంత కాదని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. నెల్లూరులో పని చేస్తున్నప్పటి నుంచే ఉదయగిరిలో ఏరియా కోఆర్డినేటర్ (ఏసీ) పోస్టును ఇన్‌చార్జిగా తెచ్చుకున్నట్లు చెబుతున్నారు. ఇదంతా ఉదయగిరిలో వైసీపీకి బలం పెంచేందుకేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలో ఈ అధికారే ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి అన్నంతగా వ్యవహరించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వెంగళరావు, ఉదయగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైసీపీ సమావేశాల్లోనూ ఆ అధికారే అంతా తానై వ్యవహరించిన వీడియోలు అప్పట్లో వైరల్‌గా మారాయి. అసలు జిల్లా అధికారులు నిర్వహించే సమావేశాలకు, టెలీకాన్ఫరెన్స్‌లకు కూడా హాజరయ్యేవారు కాదని చెప్పుకుంటు న్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఎన్నికల సమయంలో మరింత బరితెగించారు. వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేసినట్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. పొదుపు సంఘాలనూ ప్రభావితం చేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ గత నెలలో కలెక్టర్, ఎన్నికల అధికారిని ఆదేశించింది. దీంతో కలెక్టర్ హరినారాయణన్.. జడ్పీ సీఈవో కన్నమనాయుడును విచారణాధికారిగా నియమించారు. విచారణలో సదరు డీఆర్డీఏ ఏపీఎం కమ్ ఏసీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు నిర్ధారించారు. ఆయనపై చర్యలకు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఇదంతా జరిగి వారాలు గడుస్తున్నప్పటికీ ఇంత వరకూ సదరు అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదులపై గంటల వ్యవధిలోనే చర్యలు తీసుకున్న జిల్లా యంత్రాంగం.. ఈ అధికారి విషయంలో మాత్రం ఆ స్థాయిలో స్పందించకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంపై డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డిని వివరణ కోరగా ఉదయగిరి ఏసీపై వచ్చిన ఆరోపణలు నిజమని జడ్పీ సీఈవో నివేదిక ఇచ్చారని, ఆ నివేదికను కలెక్టర్‌కు పంపామని వివరించారు. సదరు నివేదికను పరిశీలించి కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- నేర సమీక్షలో ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్


నేరసమీక్షలో కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 27: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, చైన్ స్నాచింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ అధికారులకు ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో గురువారం పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. వివిధ విభాగాల సమన్వయం, సాంకేతికత సహకారంతో శోధన జరగాలన్నారు. హత్య, పోక్సో కేసుల్లోని నిందితులపై షీట్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. గస్తీని పటిష్టంగా అమలు పరచాలని, వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారులపై సిగ్నల్ లైట్లు, సూచిక బోర్డులు, స్టాపర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.34 లక్షలు

విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని ఎస్పీ హఫీజ్ భరోసా ఇచ్చారు. వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న వీ వెంకటేశ్వర్లు ఈ ఏడాది మార్చిలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి అందాల్సిన ప్రమాద బీమా రూ.34 లక్షలకు చెక్కును గురువారం పోలీసు కార్యాలయంలో వెంకటేశ్వర్లు సతీమణి కృష్ణవేణికి ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో బీ సెక్షన్ సూపరింటెండెంట్ ఖతీజాబేగం, యాక్సిస్‌బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), జూన్ 27: జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాలతో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై బుధవారం రాత్రి నుంచి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పోలీస్ అధికారుల నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఈ డ్రైవ్‌లో పాల్గొని 36 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్లపై రాంగ్ రూట్‌లో, హైవేలపై డాబా హోటల్స్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు డయల్ 112కుగానీ, స్థానిక పోలీసులకు గానీ అందించాలని ప్రజలను కోరారు.


ఆత్మకూరు బస్టాండు వద్ద శ్వాస పరీక్ష నిర్వహిస్తున్న పోలీసులు

తెల్లరాయి కోసం పంట భూములూ లోడేస్తున్నారు

- విజిలెన్స్‌కు చాగణం గ్రామస్థుల ఫిర్యాదు


విజిలెన్స్ కార్యాలయం వద్ద చాగణం గ్రామస్థులు

నెల్లూరు(క్రైం), జూన్ 27: తెల్లరాయి కోసం లైసెన్సు ఉన్న గనుల నుంచి కాకుండా ప్రభుత్వ భూములు, అటవీ భూములు, ఆఖరికి పంటలు సాగుచేసుకునే వ్యవసాయ భూ ములను కూడా లోడేస్తున్నారని సైదాపురం మండలం చాగణం గ్రామస్తులు ఆరోపించారు. విచ్చలవిడిగా తెల్లరాయిని తరలించి రూ.కోట్లు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని, దీనిపై లోతైన దర్యాప్తు చేపట్టి నివారణ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం నెల్లూరులోని విజిలెన్స్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ చాగణం గ్రామంలో 11వ మైలు దగ్గర రాపూరు-గూడూరు మెయిన్ రోడ్డు వద్ద కుమ్మరగుంట పెంచలయ్య కుమారుడు కుమ్మరగుంట చిరంజీవి, బట్టా వెంకటేష్‌కు అనుమతులు లేని ఎండీఎల్ యార్డు ఉందని తెలిపారు. అదే యార్డు పేరుతో మరో యార్డును అక్రమంగా నెలకొల్పి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అనుమతుల్లేని చోట కూడా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి తెల్లరాయిని యార్డులకు తరలించి రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. గ్రామంలోని సవటగుంటలు అనే మేత పోరంబోకు ప్రభుత్వ భూములకు సంబంధించి 100 ఎకరాల్లో సుమారు 20 నుంచి 50 అడుగుల లోతు తవ్వి అత్యంత విలువైన తెల్లరాయి, ఇతర ఖనిజాలను తరలిస్తున్నారని తెలిపారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మనుబోలు, జూన్ 27: రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై యాచవరం క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన శ్రీనివాసగౌడ్ కల్లుగీసేందుకు మనుబోలులో ఓ గౌడ్ దగ్గర పనికి కుదిరాడు. మూడురోజులుగా మనుబోలులో చెట్లుగీసి సాయంత్రం యాచవరంలో ఉన్న పిన్ని ఇంటికి వెళ్ళేవాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం గీతపని అవగానే మోటార్‌సైకిల్‌పై మనుబోలు నుంచి యాచవరం వెళుతుండగా నెల్లూరు నుంచి గూడూరు మీదుగా వెళుతున్న భారీ కంటైనర్ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో శ్రీనివాసగౌడ్ రోడ్డుపై పడడంతో లారీ చక్రాల కింద కాళ్లు, చేతులు నలిగిపోయాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓజిలి నుంచి 108 వాహనం రాగా అందులో గౌడ్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	272
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6801
వెండి కిలో ధర	రూ. 89,800
వెండి ఒక గ్రాము	రూ. 91.80


కుప్పం పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కర్ణాటక రాష్ట్ర అదనపు డీజీపీ (అంతర్గత భద్రతా విభాగం) ఎం.చంద్రశేఖర్ ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి చంద్రబాబుతో ఆయన కాసేపు ముచ్చటించారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

నెల్లూరు(క్రైం), జూన్ 27: నెల్లూరులోని బీవీనగర్ రైల్వే గేటు సమీపంలో గురువారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మృతదేహంపై పీటర్ ఇంగ్లాండ్ కంపెనీ పసుపు రంగు చొక్కా, క్రీమ్ కలర్‌పై ఆకుపచ్చ అంచు ఉన్న పంచ, బ్రౌన్ కలర్ చెప్పులు ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతి

వెంకటాచలం: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సుమారు 55 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని మహిళ వెంకటాచలం రైల్వే స్టేషన్‌లోని ఎంఎస్ 157/18 పోల్ వద్ద మృతిచెంది వున్నట్లు రైల్వే సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధా రాలు లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ జి మాలకొండయ్య తెలిపారు.

కందిపప్పు కొలతల్లో కిరికిరి!

- గత ప్రభుత్వంలో సరఫరా అస్తవ్యస్తం
- తూకంలోనూ మోసం
- జిల్లాలో నిండుకున్న గోదాములు
- వచ్చే నెలలో పంపిణీ అనుమానమే?



నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 : గత ప్రభుత్వం అన్ని రంగాలతోపాటు ప్రజాపంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చింది. వైసీపీ పాలనలో చౌకదుకాణాల ద్వారా సరఫరా చేసిన కందిపప్పు పరిమాణంలో తేడాలు ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. కిలో కందిపప్పు ప్యాకెట్‌లో సుమారు 30 నుంచి 50 గ్రాములు తూకం తక్కువ ఉన్నట్లు ప్రస్తుత పాలకులు గుర్తించారు.

అలాట్‌మెంటే... పంపిణీ చేయరు

గత ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయించింది. అయితే కందిపప్పు పంపిణీ మాత్రం సక్రమంగా చేయలేదనే విమర్శలున్నాయి. కార్డుల సంఖ్యకు తగినట్లు ఏనాడూ కందిపప్పు సరఫరా జరగలేదు. ఒక కార్డుదారుకు ఒక కిలో చొప్పున కందిపప్పును రూ.67కు ప్రభుత్వం విక్రయించింది. అయితే సంవత్సర కాలంగా జిల్లాలో కందిపప్పు పంపిణీ సరిగా జరగకపోవడం గమనార్హం. కార్డుదారులకు సరఫరా చేయకపో యినా ప్రతినెలా కందిపప్పు అలాట్‌మెంటు మాత్రం చేయడం విశేషం. ఈ క్రమంలో గోదాముల్లో నిల్వ ఉంచిన కందిపప్పు ముక్కిపోయి పురుగులు పట్టిన పరిస్థితి నెలకొంది.

గోదాముల్లో నోస్టాక్

జిల్లాలో ప్రస్తుతం కందిపప్పు నిల్వలు లేవు. కొత్తగా కందిపప్పు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుతుందనే నమ్మకమూ లేదు. ఈ క్రమంలో జూలై నెలలో రేషన్‌కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయటం ప్రశ్నార్థకమే. జిల్లాలో 7.15 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డులకు సంబంధించి 715 టన్నుల కందిపప్పు అవసరం. బయట మార్కెట్‌లో కందిపప్పు ధర రూ.175 కు పైబడి ఉండటంతో పేదలు రేషన్ కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు.

మంత్రి తనిఖీలతో వెలుగులోకి...

ఇటీవల రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికార చేపట్టాక పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొన్ని గోదాములు, రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో సరుకుల ను తూకం వేయించగా కందిపప్పు పరిమాణంలో తేడా విషయం వెలుగుచూసింది. వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాలశాఖ వారే కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చి అక్కడి నుంచి చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు సరఫరా చేయించేలా చర్యలు చేపట్టారు. అయితే కందిపప్పు తూకంలో అవకతవకలకు పాల్పడ్డట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. కిలో కందిపప్పులో 30 నుంచి 50 గ్రాములు తగ్గించి ప్యాక్ చేయించి సరఫరా చేసినట్లు మంత్రి తనిఖీల్లో బయట పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు నగరాల్లో పంపిణీ చేసిన కందిపప్పు పరిమాణంలో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కిలో కందిపప్పు ప్యాకెట్లు తూకం వేయగా ఒక్కోటి ఒక్కో బరువుతో ఉండటం గమనార్హం.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న నిపుణులు

వీఎస్‌యూలో ముగిసిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

వెంకటాచలం, జూన్ 27 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఏపీఆర్ సెట్ 2023-24 క్వాలిఫై అయిన అభ్యర్థులకు గత మూడు రోజులుగా నిర్వహించిన ఇంటర్వ్యూలు గురు వారం ముగిశాయి. నాలుగు విభాగాలకు సంబంధించి నిపుణుల పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 162 మంది అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూ లలో పాల్గొన్నారు. టూరిజం మేనేజిమెంట్‌లో 8 మంది అభ్యర్థులకు గాను ఐదుగురు, బయో టెక్నాలజీలో 94 మందికిగాను 65మంది, అప్లైడ్ లైఫ్ సైన్స్‌లో 87మందికి గాను 62 మంది, సోషల్ వర్క్ విభాగంలో 37 మందికి గాను 30 మంది అభ్యర్థులు హాజరైనట్లు పీహెచ్‌డీ సమన్వయకర్త డాక్టర్ ఎం హనుమారెడ్డి తెలిపారు.

కార్యాలయ నిర్వహణ సమర్థంగా ఉండాలి

- సహకార సిబ్బంది శిక్షణలో డీసీవో గురప్ప



నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 : సహకార సిబ్బంది వారి కార్యాల యాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా సహకారశాఖాధికారి గురప్ప ఆదేశించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో గురువారం సహకార సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడు తూ జిల్లా సహకార కార్యాలయ నియ మావళిని అనుసరించి కార్యాలయ నిర్వ హణ పద్ధతులు ఉండాలని, ఉద్యోగుల హాజరు, ఫైళ్ల నిర్వహణ సజావుగా ఉండా లని సూచిం చారు. ప్రొద్దుటూరు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జీ శ్రీనివాసరావు పలు అంశాలను వివరించారు. నెల్లూరు డీసీసీబీ జనరల్ మేనేజర్ సరిత మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలు, సేవలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహకార విద్యాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే లక్ష్యం

- ఆ విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ


హౌసింగ్ పీడీ నాగరాజును ప్రశ్నిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (హరనా థపురం), జూన్ 27 : ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ సుపరిపాలన అందించటమే లక్ష్యంగా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి హౌసింగ్, రెవెన్యూ, ఎక్సైజ్, గనులు, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. శాఖల వారీగా పురోగతిపై ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాలు ఎందుకు పూర్తి కాలేదని, లబ్ధిదారులు ఎందుకు ముందుకు రావటం లేదని హౌసింగ్ పీడీ నాగరాజును ప్రశ్నించారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రకటించారని, ఆ మొత్తం నిర్మాణ పనికి సరిపోవటం లేదని పీడీ సమాధానమిచ్చారు. మరింత రుణం అందితే లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తేనే లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటారని మంత్రి సూచించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి బార్ లైసెన్సింగ్ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మైనింగ్ శాఖపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని చెప్పారు. నుడా పరిధిలో నూతన లేఅవుట్లు వేసే వ్యాపారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో లవన్న, ఆర్డీవో మలోల, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభానికి కొడి గుడ్డను కడుతున్న అర్చకులు


మహిళలకు కొడి ముద్దలు పంచుతున్న పూజారులు

రామలింగేశ్వరుడి ఉత్సవాలకు రారండి !

- వైభవంగా ధ్వజారోహణ
- ముక్కోటి దేవతలకు ఆహ్వానం

విడవలూరు, జూన్ 27: రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సర్వ దేవతలకు ఆహ్వానం పలుకు తూ గురువారం ధ్వజారోహ ణం వైభవంగా జరిగింది. అర్చ కులు పేరేపి శ్రీకాంత్ శర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజ పూజ, భేరీ పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ స్తంభానికి నంది పటాన్ని అధిరోహింపజేశారు. అనంతరం సంతానం లేని మహిళలకు కోడి ముద్దలను పంచారు. వీటికోసం వివిధ ప్రాంతాల నుంచి సంతానం లేని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవారికి శేష వాహనంపై గ్రామోత్సవం జరిగింది. ఉత్సవాలను ఆలయ ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్) : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా అంతటా అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో రాజీకియోగ్యమైన అన్ని కేసులు పరిష్కరిస్తారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మైనింగ్ యార్డ్ పరిశీలన

చేజర్ల, జూన్ 27: కొలపనాయుడుపల్లి సమీ పంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పేరుతో నిర్వహిస్తున్న మైనింగ్ యార్డ్‌లో బుధవారం జిల్లా విజిలెన్స్ మైనింగ్ ఏడీ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో రెండోసారి తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ బాలాజీనా యక్ మాట్లాడారు. ఎమ్ డీఎల్ అనుమతి పొందిన భూమి అసైన్‌మెంట్ భూమిగా గుర్తించడంతో పాటు పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మినరల్స్ యజమాని అయిన (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), వై.సుభరత్నమ్మ పేరుతో అనుమతులు పొందినట్లు చెప్పారు. ఈ మైనింగ్ యార్డ్‌లోని 1200 టన్నుల తెల్లరాయి పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.


కొలపనాయుడుపల్లి మైనింగ్ యార్డ్‌లోని తెల్లరాయిని పరిశీలిస్తున్న అధికారులు

చట్టాలు ఏమైనా ఉన్నాయా...

అధికారుల మైనింగ్ యార్డ్ పరిశీలన అనంతరం మీడియా ప్రతినిధులు ఐసీడీఎస్ సూప ర్‌వైజర్ వైసుభరత్నమ్మ వివరణ కోసం సంప్రదించారు. సంప్రదించగా ఆమె ఇచ్చిన సమాధానంతో వారు నిర్ఘాంతపోయారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు వ్యాపారాలు చేసుకోకూడ దని చట్టాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు.

తుదిదశలో రైల్వే పనులు


డెక్ స్థాయికి చేరిన ఎయిర్ కాన్కోర్స్ నిర్మాణం


స్టేషన్ తూర్పువైపు భవంతి


పడమరవైపు కాంప్లెక్స్ నిర్మాణం

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.102 కోట్లతో చేపట్టిన ఈ పనుల్లో ఇప్పటిదాకా 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఎయిర్ కాన్కోర్స్ నిర్మాణం, డెక్ స్లాపు కాంక్రీట్ పనులు పూర్తవగా, తూర్పువైపు నుంచి సబ్‌వే నిర్మాణం పూర్తి కావస్తోంది. ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, నూతన షెడ్ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. ఇక తూర్పు, పడమర వైపు మూడు అంతస్తుల భవనాల నిర్మాణం కూడా తుదిదశకు చేరుకుంది. రైల్వే శాఖ చేపట్టిన ఈ పనులు పూర్తయితే అత్యాధునిక స్టేషనుగా అవతరించనుంది.

\- నెల్లూరు (వెంకటేశ్వరపురం)



పదేళ్లకే భవనం శిథిలం

● మందుబాబులకు అడ్డాగా పంచాయతీ కార్యాలయం

ఉదయగిరి, జూన్ 27: కొండాయపాళెం పంచాయతీ కార్యాలయ భవనాన్ని పదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10లక్షలతో నిర్మాణం చేపట్టారు. భవనంలో పంచాయతీ కార్యకలాపాలు కొన్నేళ్లపాటు కొనసాగినా అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సచివాలయాన్ని ఆ భవనంలోనే ఏర్పాటు చేసింది. తదుపరి సచివాలయాల నూతన భవనాల నిర్మాణాలు పూర్తి చేసి సచివాలయ వ్యవస్థను నూతన భవనంలోకి మార్చారు. అప్పటినుంచి ఈ భవనం నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలా పాలకు నిలయంగా మారింది. అలనాపాలన లేకపోవడంతో తలుపులు, కిటికీలు చెదలుపట్టి పాడయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పంచాయతీ కార్యాలయ భవనం

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉదయగిరి రూరల్, జూన్ 27: గండిపాళెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఒకచోట కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించి, సహపంక్తి భోజనాలు చేస్తామని పేర్కొన్నారు.

దీక్ష యాప్‌లో నమోదు చేయాలి

ఉదయగిరి, జూన్ 27: జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో విద్యా ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం జులై 25 వరకు కొనసాగుతుందన్నారు. ఆయా పాఠశాలలో పరిధిలో ఉన్నవారు ఆవాస ప్రాంతాల్లో 6-14 సంవత్సరాల లోపు పిల్లలను నమోదు చేసుకోవాలన్నారు.

నీటి నమూనాల సేకరణ


బెస్తకాలనీలోని కుళాయి నీటి నమూనాను సేకరిస్తున్న అధికారులు

సీతారామపురం, జూన్ 27: డయేరియా నివారణ చర్యల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామాల్లో అధికారులు ముందస్తుగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీతారామపురంలోని వీధుల్లో గురువారం ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ సన్నపురెడ్డి భార్గవి ఆధ్వర్యంలో కుళాయిల వద్ద నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, ఆశవర్కర్ బేబి పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన నాయకులు

అనంతసాగరం, జూన్ 27: దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం నెల్లూరులో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనంతసాగరం వాసి అల్లంపాటి సాంబశివారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధాన సమస్యలు తెలిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్‌ఎంలతో సమావేశం


మాట్లాడుతున్న ఎంఈవో జానకిరామ్

సంగం, జూన్ 27: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఎంఈవో జానకిరామ్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన దీక్షా యాప్‌లో రోజువారి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

బస్సు టైర్ పగిలింది..

ఉదయగిరి, జూన్ 27: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఉదయగిరి-కావలి బస్సుకు గురువారం త్రుటిలో ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున 5.30గంటలకు బస్సు ఉదయగిరిలో బయలుదేరింది. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే డ్రైవర్ వైపు ఉన్న ముందు టైరు పగిలింది. రోడ్డు పక్కకు వెళ్లడాన్ని గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ సర్వీసును ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, జూన్ 27: సున్నంవారిచింతలలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడురోజులు సీతారాముల ఉత్సవాలు చేపడతామని నిర్వాహకులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా నాగదేవి కల్యాణం

వింజమూరు, జూన్ 27: గోళ్లవారిపల్లె చుంచువారి ఇలవేల్పు నాగరాజు సహిత నాగదేవి కల్యాణంను భక్తులు చుంచు వంశస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరైయ్యారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. అంతకుముందు గ్రామస్థులు, పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహానికి కాకర్ల సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూనల వెంకటేశ్వర్లు, చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, దాట్ల రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

ఉదయగిరి, జూన్ 27: జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం ఏడీఏ అధికారి శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ నిల్వలు, పురుగు మందుల వివరాలు, విత్తనాలు, తదితర రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏవోలు ఆంజనేయులునాయక్, సుబ్బారెడ్డి, ఏఈవో ఇత్తడి నారాయణ పాల్గొన్నారు.

కలగానే రింగురోడ్డు నిర్మాణం?

● టెండర్లతోనే నిలిచిన ప్రక్రియ ● పనుల ప్రారంభంపైనే ఆశలు


అధ్వానంగా రామాపురం-కాకొల్లువారిపల్లి రోడ్డు

వరికుంటపాడు, జూన్ 27: అధికారుల అలసత్వమో లేదా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో తెలియదు గానీ గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ రహదారుల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పనులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోక పోవడం విచారకరం అని మండల ప్రజలు వాపోతున్నారు. అందులో భాగంగా రామాపురం జాతీయ రహదారి నుంచి హసేనేనగర్ మీదుగా కాకొల్లువా రిపల్లి జాతీయ రహదారి వరకు మంజూరైన రింగు రోడ్డు నిర్మాణం కలగానే మారింది. ఇప్పటికే రెండుసార్లు టెండర్ల ప్రక్రియ కొనసాగినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.3.80కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులను మంజూరు చేసింది. అయితే టెండర్ల ప్రక్రియలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తిరిగి వైసీపీ ప్రభుత్వ హయాంలో మరోమారు రూ.3.50కోట్లతో 3.3 కి.మీ పొడవునా నిర్మాణ పనులను మంజూరు చేసి టెండర్లను కొనసాగించినా ఫలితం లేకుండా పోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఎందుకు పనులు ప్రారంభించడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు పలురకాలుగా చర్చించుకుంటున్నారు. చేసే దేమిలేక రోజుల తరబడి రాళ్లు, రప్పల నడుమ మోకాలి లోతు గుంతల్లో ప్రయాణం కొనసా గిస్తున్నారు. అదీనూ గ్రావెల్ రహదారి కావడంతో అడుగడుగునా ఎక్కడ వాహనం గతితప్పి జారిపడి ప్రమాదాలకు గురిఅవుతుందో అని బెంబేలెత్తిపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పల్లెప్రాంతాల మీదుగా మంజూరైన రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించా లని కోరుతున్నారు.

చోరీ చేస్తాం.. తగ్గేదేలే..!

● దొరకని దొంగల ఆనవాళ్లు ● తలలు పట్టుకుంటున్న క్లూస్ టీం


ఉదయగిరి: గత నెలలో జరిగిన చోరీలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం (ఫైల్)

ఉదయగిరి, జూన్ 27: పట్టణంలో ఇటీవల జరిగిన రెండు చోరీల సంఘటనల్లో వేలిము ద్రల సేకరణ పోలీసులకు ఆనవాళ్లు దొరకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. చోరీ చేస్తాం.. తగ్గేదేలే పట్టుకోండి చూద్దాం అంటూ అటు పోలీసులు, ఇటు క్లూస్‌టీంకు దొంగలు ఆనవాళ్లు చిక్కకుండా తాము ఇంటిలో తిరిగిన ప్రదేశం, తాకిన వస్తువులు, తలుపులు, కిటికీలు, బీరువాలకు తమ వేలిముద్రలను లేకుండా తడి దుస్తులతో తుడిపేసి వెళుతున్నారు. ఉదయగిరిలో జరిగిన రెండు సంఘటనల్లో ఎలాంటి క్లూ దొరక్క పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. గతనె ల 23న స్థానిక బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. చోరీ చేసిన దొంగలు ఎక్కడ దొరక్కుండా చేసి వెళ్లారు. వచ్చిన క్లూస్‌టీంకి ఆనవాళ్లు లభించలేదు. తిరిగి నెల గడవక ముందే ఈ నెల 23న స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. వేలిముద్రల సేకరణకు వచ్చిన క్లూస్‌టీం సభ్యులకు గత పరిస్థితే ఎదురైంది. దీంతో రెండు చోట్ల చోరీలకు పాల్పడిన దొంగల ముఠా ఒకటేనని పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. పోలీసులకు దొంగలు దొరుకుతారా లేక పోలీసులకు పెనుసవాల్‌గా మారుతారా అన్నది చర్చనీయాంశమైంది.

సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే కాకర్లకు వినతిపత్రం అందజేసిన జడ్పీటీసీ మాజీ సభ్యురాలు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కలివెల జ్యోతి

సీతారామపురం, జూన్ 27: నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కలివెల జ్యోతి గురువారం వింజమూరులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలివెల జ్యోతి మండల సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రం అంజేసి మాట్లాడారు. మండలంలో వలసల నివారణకు ప్రత్యేక చర్యలు, నీటి అవసరాల కోసం సీతారా మసాగర్ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం, చెరువుల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు, మెట్ట ప్రాంతంలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు, మహిళలు, యువతకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్, తాగునీటి కోసం ఎన్‌టీ ఆర్ సుజల స్రవంతి ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలన్నారు. మండల అభివృద్ధికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ప్రైవేట్ అంబులెన్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీతో సీపీఎం, సీఐటీయు నాయకులు

ఆత్మకూరు, జూన్ 27: స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి భవన్‌లో గురువారం ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు యూనియన్ల నూతన కమిటీలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ కార్యదర్శిగా సుల్తాన్‌బాషు, అధ్యక్షుడిగా షరీఫ్ ఎన్నిక య్యారు. కార్యక్రమంలో శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, హజ రత్తయ్య, డేవిడ్‌రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా అందజేయాలి

వింజమూరు, జూన్ 27: ప్రజా పంపిణీ వ్యవస్థ సరుకులను సక్రమంగా అందజేయాలని తహసీల్దారు ఎంవీ.కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఎండీయూ వాహనాల డ్రైవర్లు రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జూలై 1వ నుంచి ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులను వాహనాలతో కార్డుదారులకు అందజేయాలని ఆదేశించారు. ఎండీయూ వాహనాల డ్రైవర్లు వాహనాలను సిద్ధం ఉంచాలన్నారు. కార్యక్రమంలో మోహన్, డ్రైవర్లు ఉన్నారు.

డిప్యూటీ డీఈవో పాఠశాల తనిఖీ


రికార్డులు చూస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

సంగం, జూన్ 27: మర్రిపాడు జిల్లా ఉన్నత పాఠశాలను గురువారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు, స్టూ డెంట్ స్కూల్ కిట్ పంపిణీ తదితర అంశాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు నూరుశాతం హాజరు నమోదైయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరిసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

సంగం, జూన్ 27: ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ చిన్నారులకు చేతుల శుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డయేరియాకు గల కారణాలను వివరించారు. అంగన్‌వాడీ పరిసర ప్రాంతాల్లో దోమలు చేరకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మానసాదేవి ఉత్సవాలు

వరికుంటపాడు, జూన్ 27: తూర్పురొంపిదొడ్లలో వెలసిన మానసాదేవి ఆలయ పదో వార్షికోత్సవ ఉత్సవాలను చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపా రాధన, ప్రత్యేక పూజలు, శనివారం హోమాలు, మహానివేదము, గ్రామోత్సవం, ఆదివారం వాల్మీకి పూజ, కుంకుమపూజ, పొంగళ్లతో నైవేద్యం పెడతామన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మలుపుల రోడ్లలో ఆగని ప్రమాదాలు


కొత్తపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కలిగిరి, జూన్ 27: గ్రామీణ రహదారుల్లోని మలుపులు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తపేట, అనంతపురం, ఎరుకలరెడ్డిపాలెం, గుడ్లదొన, చినఅన్నలూరు గ్రామాల మీదుగా వెళ్లే రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద ఆర్ అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అంతేకాకా అవి సింగిల్ రోడ్లు కావడం, మలుపుల వద్ద కూడలి ప్రాంతంగా ఉండటం, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

వైసీపీ నేతల ఓట్ల రాజకీయం

● ఎన్నికల సమయంలో సీసీ రోడ్ల నిర్మాణానికి హడావిడి
● కోడ్ రావడంతో ఆగిన పనులు
● ప్రభుత్వం మారడంతో నిర్మాణానికి ముందుకు రాని కాంట్రాక్టర్ ● రాకపోకలకు ప్రజల ఇక్కట్లు

కావలి, జూన్ 27: ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని వదిలేసి, ఎన్నికల సమయంలో ఓట్లకోసం వైసీపీ నేతలు సీసీ రోడ్ల నిర్మాణానికి హడావుడి చేశారు. వాస్తవానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ నిధులు నిర్వహణకు కూడా చాలక ఇబ్బందులు పడుతుండగా, ఎన్నికల వేళ ఓట్ల కోసం టీచర్స్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60లక్షలను జనరల్ ఫండ్స్ నుంచి మంజూరు చేశారు. ఆ పనులను కూడా బినామీ పేరుతో వైసీపీ నాయకులకే అప్పగించారు. సీసీ రోడ్డు పూర్తి చేసి ఆ ప్రాంతంలోని ఓట్లను అప్పనంగా వేయించుకోవాలని హడావిడి చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావటంతో రోడ్డు నిర్మాణం అర్ధంతరంగా ఆపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా కూడా అక్కడ రోడ్డు పనులు చేపట్టక పోవటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

● అసంపూర్తిగా నిర్మాణాలు

ట్రంకురోడ్డు నుంచి పొలాల్లో ఉన్న లేఅవుట్ వరకు పెద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొన్ని చోట్ల మొదటి లేయర్ వేసి, రెండో లేయర్ వేయకుండా వదిలి వేశారు. మరికొన్ని చోట్ల రోడ్డు నిర్మాణం కోసం కాంక్రీట్ గోడలు నిర్మించి వదిలేశారు. ఈ సీసీ రోడ్డుకు మధ్యమధ్యలో పలు అడ్డ రోడ్లు రావటంతో వాటి వద్ద రోడ్డు క్రాసింగ్‌కు అనువుగా అప్రోచ్ రోడ్డు వేయకుండా వదిలివేశారు. దీంతో అడ్డరోడ్లు పై నడిచే ప్రజలు సీసీ రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను తోలుకున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్డును పూర్తి చేయించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది.

పూర్తి చేయిస్తాం

సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ రావటంతో పనులు ఆపివేశారు. ఆ నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

\- ఏఈ శ్రీనివాసులురెడ్డి


కావలి టీచర్స్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు


సీసీ రోడ్డు నిర్మాణం కోసం కట్టి వదిలేసిన సైడ్ వాల్స్

పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు


కలిగిరి : పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కలిగిరి, జూన్ 27: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమావేశానికి ఆలస్యంగా రావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి సమయపాలన విధుల్లో భాగమన్నారు. మండల పరిధిలో ఒకరిద్దరు కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ల పనితీరు బాగా లేదని, వారు తమ పద్ధతిని మార్చుకోకపోతే జిల్లా అధికారులకు నివేదికను పంపుతామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీపై నేడు సమీక్ష

అల్లూరు : పింఛన్ల పంపిణీపై శుక్రవారం పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్ల పంపిణీ చేపడతామని, సిబ్బంది సరిపడా లేకుంటే అంగన్‌వాడీ సిబ్బంది లేదా ఇతర సిబ్బందిని వినియోగించుకుంటామన్నారు. జూన్30న ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో శనివారమే పింఛన్ల నగదు డ్రా చేసుకోవాలనే అంశంపై కూడా చర్చిస్తామన్నారు.


దీక్ష యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో వెంకటసుబ్బయ్య

కావలిటౌన్, జూన్27: దీక్షా యాప్‌పై ప్రధానోపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొని అవగాహన కల్పించారు. దీక్షా యాప్‌పై ప్రతిఒక్క ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీచర్లు విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలతోపాటు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

జూ. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి


గుడ్లూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కందుకూరు ఉప విద్యాశాఖాధికారి ప్రసాదరావు

గుడ్లూరు, జూన్ 27: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని కందుకూరు ఉప విద్యాశాఖాధికారి ఎంవీవీ ప్రసాదరావు అన్నారు. గుడ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తొలుత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీ రామోహన్‌రావు, పాఠశాల సిబ్బంది పద్మావతి, కాపులూరి వెంకటేశ్వర్లు, సులోచన, బత్తల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో సిబ్బందిని నియమించండి

లింగసముద్రం: సచివాలయం-2 పరిధిలో అధికారులు ఆర్‌బీకేని నిర్మించారు.కానీ సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీంతో నాలుగేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ఏడాది క్రితం అన్నెబోయినపల్లికి చెందిన వీఏఏను ఆర్‌బీకేకి ఇన్‌చార్జిగా నియమించారు. ఎ న్నికలకు ముందు ఆమె బదిలీపై వెళ్లిపోయింది.దీంతో స్థానిక వీఏఏ కిరణ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.ఆయన కూడా నాలుగు నెలలు పనిచేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ ఆర్‌బీకే తలుపులు మూసే ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ మొదలు కావడంలో అధికారులు సిబ్బందిని నియమించాలని మండల రైతులు కోరుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిల్వ

చిట్రగుంట : బోగోలులోని రైస్‌మిల్లు కూడలిలో బుధవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిల్వ చేరింది.దీంతో గురువారం ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిమెంట్‌తో మురుగు కాలువలు నిర్మించినా, కనెక్షన్ ఇవ్వక పోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి పోతున్నాయి. ఇకనైనా పంచాయతీ అధికారులు వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయుడి ఉత్సవాలు


ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

వలేటివారిపాలెం, జూన్ 27: మండలంలోని శింగమనేనిపల్లెలో గురువారం అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు నాగేశ్వరరావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి అత్తోటి అంజమ్మ, టీడీపీ నేతలు విజయసారథి, అత్తోటి వెంకటేశ్వర్లు, కొత్త మాధవరావు, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు



బాలకార్మికులతో పనులు చేయించడం చట్ట విరుద్ధమని ఫ్లెక్సీ ప్రదర్శించిన అధికారులు

కావలి రూరల్, జూన్ 27: బాలకార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా గూడూరు కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎం.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. కావలిలో గురువారం బాలకార్మికుల గుర్తింపు కోసం సోదాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించకుండా వారిని బడికి పంపేలా ప్రోత్సహించాలన్నారు. ఉదయగిరి బ్రిడ్జి కింద, ఎస్‌బీఐ రోడ్డు, ట్రంక్‌రోడ్డులో నిర్వహించిన సోదాల్లో పనులు చేస్తున్న ఇద్దరు బాలకార్మికులను గుర్తించామని, ఆ యజమానులపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని పలుప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు ఎస్. హరిబాబు, ఐ.వెంకటేశ్వర్లు, సత్యన్నారాయణ, సతీష్‌బాబు, ప్రసాద్, సుమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా కందుకూరు : ఇంటూరి

కందుకూరు, జూన్ 27: కందుకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాజీకౌన్సిలర్లు, టీడీపీ ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులతో చర్చించారు. మున్సిపల్ శాఖామంత్రి నారాయణ సహకారంతో ఆరునెలల్లోపు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఇంటూరి పేర్కొన్నారు.

● అన్న క్యాంటీన్ పరిశీలన

స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఇంటూరి పరిశీలించారు. త్వరలో క్యాంటీన్ పునః ప్రారంభమవుతున్నందున అవసరమైన పనులను పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధు, రావూరి రామకోటయ్య, పొడపాటి నాగేశ్వరరావు, రావి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోకూరు, బడేవారిపాలెం, నూకవరం, నేకునాంపురం, కాకుటూరు గ్రామాల్లో శుక్రవారం ఉద యం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తాటికొండ మధుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోకూరు బస్టాండు సెంటర్‌లో విద్యుత్ తీగలు మార్చే క్రమంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


బస్‌షెల్టర్ ముందున్న ట్రాన్స్‌ఫార్మర్

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు అభ్యంతరం చెప్పినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికులు కూర్చొనేందుకు భయపడుతున్నారు. మరికొంతమంది బస్‌షెల్టర్ వద్దకు అసలు వెళ్లడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అవినీతిమయంగా ఉపాధి హామీ పథకం..!

- హాజరు పట్టికలో సంతకాల మాయాజాలం
- వలంటీర్లు కూడా ఉపాధి హామీ కూలీలే !



ఉపాధి కూలీలకు హాజరు వేస్తున్న ఫీల్డు అసిస్టెంటు (ఫైల్)

కోవూరు, జూన్ 27: ఉపాధిహామీ పథకం పనుల్లో నియోజకవర్గ పరిధిలో అవినీతి చోటుచేసుకుంది. గత ప్రభుత్వ నాయకుల అండ దండలతో ఫీల్డు అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం మారిన తరువాత వారి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఉపాధి హామీ పనుల హాజరు విషయంలో ఫీల్డు అసిస్టెంట్లు చేసిన అక్రమాలు పరిశీలించిన అధికారులు విస్తుపోతున్నట్లు తెలిసింది. తమకు అందు బాటులో ఉండే కూలీల పేర్లు మాత్రమే ఫీల్డు అసిస్టెంట్లు రిజిస్టర్లలో నమోదుచేశారనే ఆరోపణలున్నాయి. కోవూరు మండల పరిధిలోని గ్రామా ల్లో వలంటీర్లుగా పనిచేస్తున్న యువకుల్ని కూడా కూలీలుగా నమోదు చేసినట్లు తెలిసింది. పడుగుపాడు, గంగవరం, పాటూరు, కోవూరు గ్రామాల్లో వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూనే ఉపాధిహామీ పనుల కూలీ సైకం కూడా తీసుకున్నట్లుగా తెలిసింది.

ఎక్సకవేటర్లతో పని... కూలీలకు వేతనం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పూడికతీత, కాలువ మరమ్మతు పనుల్ని ఎక్సకవేటర్లతో చేసి ఉపాధిహామీ కూలీలకు కూలీ సైకం చెల్లించినట్లు రికార్డుల్లో నమోదుచేసుకున్నారు. ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పరస్పరం సహకరించుకుని ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. కూలీలకు చెల్లించాల్సిన సైకం చెల్లించకుండా ఎక్సకవేటర్లతో పనిపూర్తిచేశారు. పలుచోట్ల కాలువ పూడికతీత పనులు కూడా ఎక్సకవేటర్లతో చేశారు. కొన్ని కాలువలకు పూడిక తీయకుండానే తీసినట్లు రికార్డు చేసుకున్నారు. వర్షాకాలం రావడంతో పూడిక తీసిందీ, లేనిదీ అధికారులు కనుక్కోలేకపోయారు.

ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టాలి

గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై విచారణ చేపట్టాలని, పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారని, అవినీతికి పాల్పడిన సిబ్బంది, అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోవూరు టీడీపీ మండల కమిటీ కార్యదర్శి యద్దలపూడి నాగరాజు, విడవలూరు తెలుగు యువత నాయకుడు కప్పిర శ్రీనివాసులు తదితరులు కోరుతున్నారు.

అవినీతి అవాస్తవం : ఏపీవో

ఉపాధి హామీ పనుల్లో అవినీతి అవాస్తవం. వలంటీర్లకు మస్టర్లు వేయడం అవాస్తవం. పనులన్నీ పారదర్శకంగా చేశాం. ఆరోపణలు అవాస్తవం అని కోవూరు ఏపీఓ సుబ్బారావు తెలిపారు.

డేంజర్



నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ ఎదుట సర్వేపల్లి కాలువ అంచున ప్రధాన రహదారి కోతకు గురవుతోంది. కాలువ కట్ట దెబ్బతినడంతో రోడ్డు అంచు నుంచి లోపలికి పెద్ద గాడి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహన దారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పెను ప్రమాదానికి గురికావలసి ఉంటుంది. సర్వేపల్లి కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తి చేయకపోవడంతో ఇలా కాలువ గట్టు దెబ్బతిని డేంజర్ బెల్స్ మోగిస్తోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పొదలకూరు, జూన్ 27: నేను బడికి పోతా కార్య క్రమంలో భాగంగా గురువారం మండలంలోని మహమ్మ దాపురం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో వీధివీధి తిరు గుతూ బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పిం చాలని నినాదాలు చేశారు. ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారి కె రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయ ఈవోగా ఏవీ శ్రీనివాసులురెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27: మండలంలోని జొన్నవాడ ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఏవీ శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ విజయవాడలోని గొల్లపూడి దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శ్రీనివా సులురెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో జొన్నవాడ ఆలయానికి ఈవోగా పనిచేశారు. వెంకటగిరి పోలేరమ్మ దేవస్థానానికి ఆయన శాశ్వత ఈవోగా కొనసా గుతున్నారు. ఇప్పటివరకు జొన్నవాడ ఆలయ ఈవోగా పనిచేసిన వి గిరికృష్ణ నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయా నికే ఈవోగా పరిమితమవుతారు.

కొమ్మలపూడి సర్పంచుకు రెడ్‌క్రాస్ అభినందనలు

మనుబోలు, జూన్ 27: మండలంలోని కొమ్మలపూడి గ్రామ సర్పంచు బందిల వేణుగోపాల్‌ను గురువారం రెడ్‌క్రాస్ సంస్థ ప్రశంసించింది. సర్పంచు తన పుట్టినరోజు సందర్భంగా జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ అజయ్‌బాబు ప్రోత్సాహంతో నెల్లూరులో తనతో పాటు, 20మంది యువకులచే రక్తదాన శిబిరం ఏర్పాటుచేయించి రక్త దానం చేశారు. దీంతో సర్పంచుకు ప్రశంసాపత్రం అందిం చి రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

తోటపల్లిగూడూరు, జూన్ 27: మండలంలోని కో డూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠ శాలలో 6,7 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ నిమి త్తం శుక్రవారం 10గంటలకు పోటీపరీక్ష నిర్వహిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ ప్రకటనలో తెలిపారు. 6వ తర గతిలో ఎస్టీ -1, 7వ తరగతిలో ఎస్సీ -2 ఖాళీలు ఉన్న ట్లు తెలిపారు. అర్హులైనవారు సంబంధిత ధ్రువీకరణ ప త్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుతో పరీక్షా కేంద్రానికి సకా లంలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవ కాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (వైద్యం), జూన్ 27 : కాలేయ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చెన్నై గ్లెనిగల్స్ హెల్త్‌సిటీ ప్రముఖ లివర్ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ రజనీకాంత్ వెల్లడించారు. నగరంలోని గ్లెనిగల్ ఆసుపత్రి ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహిం చారు. అనంతరం లివర్ మార్పిడి శస్త్రచికిత్స చేయించు కున్న వారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎక్కువగా లిక్కర్ తాగేవారికి కాలేయ సమస్యలు వస్తాయన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల కూడా కాలేయ సమస్యలు వస్తా యని చెప్పారు. ఇప్పటి వరకు 1500కుపైగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామ ని చెప్పారు. ప్రతినెల మెదటి గురు, శుక్రవారాలలో నెల్లూ రులో అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో లివర్ మార్పిడి చేయించుకున్న లక్ష్మీరెడ్డి, శేషారెడ్డి, రక్షిత గ్లెనిగల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ మేనేజర్ మునికు మార్, అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రేడియో, టీవీ ఆర్టిస్టుకు అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 : ప్రముఖ నాదస్వర విద్వాన్, కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాన్ డాక్టర్ ఆర్‌కే వీరరాఘవన్ ఆల్‌ఇండియా రేడియో, టీవీ ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు కే మాల్యాద్రి ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. డాక్టర్ ఆర్‌కే వీరరాఘవన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు వాసి. నాదస్వర కళాకారుడిగా పలు రాష్ట్రాల్లో సంగీత కచేరీలు చేసి ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. ఆల్‌ఇండియా రేడియో, టీవీ ఏ గ్రేడ్ ఆర్టిస్టుగా సర్టిఫికెట్ అందుకోవడం గర్వంగా ఉందని తెలిపారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ జరుపుతున్న ఏపీడీ మృదుల

విడవలూరు, జూన్ 27: విడ వలూరు పంచాయతీకి చెందిన ఉపా ధిహామీ పథకం కింద పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ రాంప్రసాద్‌పై గురు వారం డ్వామా ఏపీడీ మృదుల గ్రామ ంలో విచారణ చేపట్టారు. ఉపాధి హా మీ పథకం అమల్లో రాంప్రసాద్ నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తూ పని దినాలను కల్పించడం లేదని జిల్లా ఉన్నతాధి కారులకు ఫిర్యాదులు అందాయి. దీం తో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్వామా ఏపీడీ మృదుల గ్రామంలో విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడారు. దీంతో వారు ఫీల్డ్ అసిస్టెంట్ తమకు సక్రమంగా పని దినాలను కల్పించడం లేదని, పనిచేసినా నగదు ఇవ్వడం లేదని రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈమేరకు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఏపీడీ మృదుల తెలిపారు. ఈ విచారణలో టీఏ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తోటపల్లిగూడూరు, జూన్ 27: సీజనల్ వ్యాధులపై అప్ర మత్తంగా ఉండాలని ఎంపీడీవో బా లాజీ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని శాఖల అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్డుపక్కన చెత్తదిబ్బలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కోడూరు, వరిగొండ వైద్య అధికారులు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కున్నట్లయితే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ప్రజలకు సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఏపీఎం శైలజ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై చిగురిస్తున్న ఆశలు



అర్ధంతరంగా ఆగిన అన్న క్యాంటీన్ నిర్మాణం

కోవూరు, జూన్ 27: గత టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఏర్పాట్లుచేసింది. 2019 ఫిబ్రవరి 4న రూ. 35లక్షల వ్యయంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దిమ్మెల ఏర్పాటువరకు భవన నిర్మాణం జరిగింది. తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో భవన నిర్మాణాన్ని ఆపేశారు. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానికుల్లో ఆశలు చిగురించాయి. అన్నా క్యాంటీన్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాల్సిందిగా పేదలు కోరుతున్నారు.

రూ.6 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- వైసీపీకి చెందిన ఓ నేత నిర్వాకం
- అడ్డుకున్న టీడీపీ నాయకులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

తోటపల్లిగూడూరు, జూన్ 27: కోట్ల రూపాయల విలువ జేసే ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేస్తున్నా రు. తోటపల్లిగూడూరు మం డలం నరుకూరు సెంటర్‌లో సర్వే నెం.1లో 0.62 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీకి చెందిన ఓ నేత ఆక్రమించారు. దీనివిలువ సుమారు రూ. 6కోట్ల వరకు ఉంటుందని అం చనా. నరుకూరు కూడలిలో 15ఏళ్ల క్రితం ఓ రైతు నుంచి పట్టా భూమిని రియల్టర్లు కొనుగోలు చేసి ప్లాట్లు వేశారు. అయితే దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించేశారు. దీనిపై అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు స్థలాన్ని అప్పట్లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత నరకూరులో రెండు వర్గాలుగా ఉన్న నాయకులు ఒక వర్గం జగనన్న కాలనీకి ఇవ్వాలని, మరో వర్గం ఇచ్చేది లేదని చెప్పారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని అధికారులు ఆ ప్రక్రియను ఆపేశారు. రూ.కోట్లలో విలువజేసే ఈ భూమిని ఎలాగైనా తవ వశం చేసుకోవాలనే తలంపుతో మండలస్థాయి నాయకులతో చర్చలు జరిపారు. వారికి భారీ మొత్తం ఇస్తానని చెప్పడంతో సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆ ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఎన్నికల సమయంలో ఆ స్థలంలో కొన్ని నిర్మాణ పనులు చేపట్టడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అయితే, ఈ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని ఇల్లు లేని నిరుపేదలకు లేదా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27: నగరంలోని అయ్యప్పగుడిలో వేంచేసి ఉన్న గురువాయూర్ మహావిష్ణు స్వామి వారికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం మహాలక్ష్మీ గోదా సమేత గురువాయురప్పన్ మహావిష్ణు స్వామి వారికి అష్టోత్తర శత కలశ అభిషేకం నిర్వహించారు. భద్రాచలం సీతారామ స్వామి దేవస్థానం ఆస్థానాచార్యులు కమాండూరు ఇళయపల్లి స్థలశాయి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఉషమ్మ దంపతులు, బొందల నరసింహారెడ్డి, విజయలక్ష్మీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం అంకురార్పణ, యాగశాల ప్రవేశం దీక్షాధారణ కార్యక్రమం జరిగాయి. కే శ్రీనివాస్, రాధమ్మ దంపతులు, సింగంపల్లి నిఖిలేష్‌కుమార్, దివ్యభవానీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, కేజీ శంకరన్, పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జడ్పీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అధికారులు, నేతలు

నెల్లూరు (విద్య), జూన్ 27 : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులకు స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ పురస్కారాలు అందచేశారు. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారన్నారు. స్పందన ఫౌండేషన్ నిర్వాహకుల సేవలు అభినందనీయమన్నారు. 23 మంది విద్యార్థులకు రూ.5వేలు చొప్పున రూ.1.15లక్షలు పంపిణీ చేయడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు కూడా ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఫౌండేషన్ చైర్మన్ నిడమానూరు నాగేశ్వరరావు, కార్యదర్శి గుర్రం వెంకట సురేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 2007 నుంచి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అతిథిగా హాజరైన టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విద్యార్థులకు బ్యాగులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, పద్మప్రియ ఫైనాన్స్ అధినేత గడ్డం రత్నం చౌదరి, నేతలు నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ శ్రీనివాసకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు జనసేన నేతల సత్కారం



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని సత్కరిస్తున్న జనసేన నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), జూన్ 27: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం సంతపేటలోని ఆయన నివాసంలో జనసేన పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ మంత్రి ఆనం సేవలు జిల్లాకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, వై రవి, కృష్ణారెడ్డి, నాగరత్నమ్మ, చరణ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేయండి

- గిరిజన గురుకులాల టీచర్లు



వినతిపత్రం అందిస్తున్న గిరిజన గురుకుల ఉపాధ్యాయులు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), జూన్ 27: 'గిరిజన గురుకులాల్లో పదేళ్లుగా పని చేస్తున్నామని, మా ఉద్యోగాలను డీఎస్సీలో కలపడం వల్ల మేము తీవ్రంగా నష్టపోతాం, మా సమస్యను జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయండి' అని గిరిజన గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహించే పలువురు టీచర్లు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌ను కోరారు. గురువారం నగరంలోని సంతపేటలో గల పార్టీ కార్యాలయంలో పలువురు గిరిజన గురుకులాల ఉపాధ్యాయులు కిషోర్‌ను కలిశారు. జిల్లాలో 2016వ సంవత్సరంలో ఔట్‌సోర్సింగ్ కింద గిరిజన గురుకుల సిబ్బంది నియామకం జరిగిందని, అప్పటి నుంచి చాలీచాలని జీతంతోనే నెట్టుకొస్తున్నామని చెప్పారు. కొత్త ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో ఈ ఉద్యోగాలను కలుపుతూ నోటిఫికేషన్ ఇవ్వడంతో తామంతా ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడుతామన్నారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని గునుకుల కిషోర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే శ్రీనివాసులు, కేవీ రమణయ్య, సురేఖ, అనిత పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రతిభ పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో సరస్వతీ సమాజం ట్రస్టీలు, కార్యవర్గం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందులరెడ్డి సరస్వతీ సమాజంలో గురువారం ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం కన్నుల పండువగా జరి గింది. 2022-23 విద్యా సంవత్సరం లో మూలాపేట, ఫత్తేఖాన్ పేట, దర్గామిట్ట ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 8 మంది విద్యార్థులకు సరస్వతీ సమాజం ప్రతిభా అవార్డులు అందజేశారు. అనంతరం జరిగిన సభలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రొత్తపల్లి నరసింహారెడ్డి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఎంఈవో పీ అమర్‌నాథ్ సింగ్ మాట్లా డుతూ ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించి, తల్లిదండ్రుల కలల్ని పండించడంతోపాటు దేశానికి ఉపయోగపడాలని కోరారు. సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో కార్పొరేట్ విద్యార్థులతోపోటీ పడి ర్యాంకులు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, వేదమూర్తి, వైవీఎస్ శ్రద్ధా, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 27 : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ అభాగ్యులకు సేవ చేయడమే కాదు, యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తుందని జేసీఐ మాజీ అధ్యక్షుడు సతీష్‌కుమార్ తెలిపారు. స్టోన్‌హౌస్‌పేటలో జేసీఐ ఫౌండర్, హెన్రీ గేసెంబెర్ 132వ జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. జేసీఐ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల ఐటీఐలో ఉద్యోగమేళా

నెల్లూరు (విద్య), జూన్ 27 : నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఉత్తర్వుల మేరకు నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలికల ఐటీఐలో గురువారం ద్వితీయ సంవ త్సరం విద్యార్థులకు ఉద్యోగ మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థుల ఎంపిక చేపట్టా రు. మొత్తం 144 మంది మేళాలో పాల్గొనగా 103 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు లభించాయని కళా శాల ప్రిన్సిపాల్ షేక్ రజియా తెలిపారు. ఎంపికైన వారిలో 65 మందికి వెంటనే ఆఫర్ లెటర్స్ కూడా అందచేశా రన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ కే శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి కేవీ రామాంజనేయులు, ట్రైనింగ్ ఆఫీసర్ ఆర్ ప్రభాకర్, ఎన్ అఖిలారెడ్డి, టాటా సీమెన్స్ సీఎస్ఆర్ సీనియర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం మార్కండేయులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఘనంగా నివాళి

నెల్లూరు (లీగల్), జూన్ 27 : ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన సీనియర్ న్యాయ వాదులు పులి బలరామయ్య, తన్నీరు కోటయ్య, షేక్ షకీల్, కుంచాల కృష్ణకు జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామినీ అధ్య క్షతన గురువారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, న్యా యవాదులు ఘనంగా నివాళులర్పించారు. బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, పలువురు న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా హై కమిషర్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం); జూన్ 27 : ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్‌ను గురువారం ఢిల్లీలోని ఆస్ట్రేలియన్ హైకమిషనర్ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిశారు. ఫిలిప్ గ్రీన్‌కు పుష్ప గుచ్ఛం అందచేసి సత్కరించారు. అనంతరం ఆయనతో పలు అంశాలపై చర్చించారు.

60 ఏళ్లు దాటితే క్షయ టీకా వేసుకోవాలి

- డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సమంత



వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ సమంత

నెల్లూరు (వైద్యం), జూన్ 27 : వయసు 60 ఏళ్ల పైబడిన వారు తప్పని సరిగా క్షయవ్యాధి నివారణ కోసం అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ కన్సల్టెంట్ డాక్టర్ సమంత వెల్లడించారు. గురువారం నగరంలోని చంద్రమౌళినగర్, జేవీఆర్ కాలనీల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. మధు మేహం ఉన్నవారు, ధూమపానం, మద్యపాన ప్రియులు, క్షయవ్యాధి కుటుంబ సభ్యులు కూడా ఈ బీసీజీ వాక్సిన్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికా రులు డాక్టర్ హిమ దీప్తి, డాక్టర్ కిరణ్, కో ఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, శ్రవణ్, మధుసూదన్, హరీష్, మంగమ్మ, వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బకించంద్ర చటర్జీ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 27 : వందేమాతరం గీత రచయిత బకించంద్ర చటర్జీ జయంతి గురువారం ఆర్ఎస్ఆర్ పాఠశాలలో జరిగింది. వందేమాతరం గీతా లాపనపై మురి గపూడి ట్రస్ట్ విద్యార్థులకు పోటీలు నిర్వ హించింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వందే మాతర గీతం విశేషాలను, బకించంద్ర చటర్జీ దేశభక్తిని ఉపాధ్యాయులు వివరించారు. కాగా, ఇదే పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కూడా నిర్వహిం చారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఎం సతీష్‌కుమార్ మాట్లా డుతూ మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల యువత ఏ విధంగా ఆరోగ్యాన్ని కోల్పోతోంది, మానసిక శారీరక రుగ్మతలతో నిర్వీర్యం అవుతోందో వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరం ఉంటామని యువత, విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్, బాలబ్రహ్మాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది




ఫుట్‌పాత్ ఆక్రమణలపై కార్పొరేషన్ కొరడా

- టీడీపీ నేతల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై తిరుపతి నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పురిగొల్పి చిరువ్యాపారులనుంచి నెలవారీ మామూళ్లను అధికార పార్టీ నేతలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై దృష్టిసారించింది. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు పార్టీ శ్రేణులతో కలసి ఐదు రోజుల క్రితం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌తో పాటు టీటీడీ ఈవోకు, ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. స్మార్ట్ సిటీ నిధులతో పాదచారులకోసం అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి.బాటసారులకు నడిచేదారిలేక అవస్థలు పడుతున్నారు.చాలాచోట్ల ఫుట్‌పాత్‌లపై శాశ్వత నిర్మాణాలు చేపట్టి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రహదారిపైకి వచ్చే వాహనాలు వేగంగా వెళ్లడంతో బాటసారులు నడిచే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులో మొదలైన ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు గురువారం గాంధీరోడ్డుకు చేరుకుంది. విష్ణునివాసం, గోవిందరాజ స్వామి అలయం, గాంధీరోడ్డు వరకు కార్పొరేషన్ అధికారులు పోలీసు బలగాలతో కలసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఇప్పటివరకు 60కిపైగా ఆక్రమణలు తొలగించినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం చెప్పారు. కొన్ని చోట్ల వైసీపీ, వామపక్ష నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు ముందుకు పోతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతుల కారణంగానే వైసీపీ నేతలు దందాలు చేసి తోపుడు బండ్ల దగ్గర వసూలు చేశారంటున్న వామపక్ష నాయకులు తొలగింపును తాము స్వాగతిస్తామంటున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నేతలు కూడా ఫుట్‌పాత్‌లపై బండ్లుపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదంటున్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ అని శుక్రవారం బైరాగిపట్టెడ, ఆ తర్వాత తిరుమల బైపాస్ రోడ్డువైపు వెళ్లనున్నట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే తోపుడు బళ్ల వ్యాపారం కోసం ప్రత్యామ్నాయంగా ప్రత్యేక హాకర్ జోన్స్ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఆ దిశగా కూడా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాల్సి వుందని పలువురు సూచిస్తున్నారు.

1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు



- జిల్లాలో 2,69,162మందికి లబ్ధి
- రూ.182.33కోట్లు మంజూరు
- సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 27 : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్లను జూలై 1న పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.రూ.3వేలున్న పింఛను రూ.4వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచే పెంచిన మొత్తాన్ని అందజేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛను పెంపు ఫైల్‌పై ఆయన సంతకం చేశారు.ఈ నేపథ్యంలో పింఛనుదారులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా వారికి ఇంటి వద్దే పింఛను అందేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లను పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది.జిల్లావ్యాప్తంగా 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5,827 సిబ్బంది ఉన్నారు. ఆ పరిధిలోని లబ్ధిదారులకు ఎలాంటి సమస్య లేకుండా ఒకటి రెండు రోజుల్లో పింఛన్ల ప్రక్రియ పూర్తిచేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర తెలిపారు. ఒక్కో ఉద్యోగికి 50 ఇళ్ల చొప్పున మ్యాపింగ్ చేశామన్నారు..జూలై 1న ఏప్రిల్, మే, జూన్‌లకు కలిపి రూ.7వేలు పంపిణీ చేయనున్నారు.ఈ నెల 30వ తేదీ ఆదివారం కావడంతో 29వ తేదీకే అన్ని సచివాలయాలకు పెన్షన్ల సొమ్ము అందజేయనున్నారు.జిల్లాలోని 2,69,162మంది లబ్ధిదారులకు ప్రతి నెలా సుమారు రూ.81కోట్లు పంపిణీ చేసేవారు.పెన్షన్ల పెంపుతో ఈ నెల రూ.182.33 కోట్లు పంపిణీ చేయనున్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చాలి

తిరుపతిరూరల్,జూన్27: చిరుధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగం చేయడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచవచ్చని భారత వ్యవసాయ పరిశోధనామండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ పేర్కొన్నారు. తిరుపతిలోని వెటర్నరీవర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.దేశవ్యాప్తంగా చిరుధాన్య పంటలసాగు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత అధికంగానే ఉందని తెలిపారు.5వేల సంవత్సరాలుగా సాగులో ఉన్నపంటగా సజ్జకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మిదేవి మాట్లాడుతూ ఏపీలో ప్రతి జిల్లాలో ఒక్కొక్కరకం చిరుధాన్యపంట సాంప్రదాయపంటగా సాగులో ఉందని, ఐసీఏఆర్ సహకారంతో వర్సిటీపరిధిలోని నాలుగు పరిశోధనాస్థానాల్లో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తూ అనువైన చిరుధాన్య రకాలను, సాగుకు అవసరమైన సాంకేతికతను అందిస్తున్నామని తెలిపారు.పోషకాహార భద్రతలో చిరుధాన్య పంటల పాత్ర ఎక్కువగా ఉందని, కొవిడ్-19 తర్వాత చిరుధాన్య ఆహారంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు.ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్ మాట్లాడుతూ ఉత్పాదకత పెంచితే చిరుధాన్యాల సాగు లాభదాయకమవుతుందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ,ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్,ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీవ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, 220మంది పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న తిలక్‌రాజ్ శర్మ



మూడు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న చిత్తూరు జడ్పీ మాజీ సీఈవో (ఎఫ్ఏసీ) ప్రభాకర్‌రెడ్డిపై వేటు పడింది. వైసీపీ ప్రభుత్వంలో.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆయన ఎట్టకేలకు సస్పెండయ్యారు. ఈ మేరకు గురువారం పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

\- చిత్తూరు రూరల్

- ఎట్టకేలకు జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్
- విచారణ పూర్తయ్యేవరకు హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లకూడదని ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ కమిషనర్

పదవీ విరమణలోపే వేటు

బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా రెగ్యులర్ పోస్టులో ఉన్న ప్రభాకర్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత జూనియర్ అధికారి. ఏ మాత్రం అర్హత లేకున్నా చిత్తూరు జిల్లా పరిషత్తు సీఈవో పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో సుదీర్ఘంగా కొనసాగారు. అంతే కాకుండా, సీఈవోతో పాటు డిప్యూటీ సీఈవో, ఏవోగా మూడు పోస్టుల్లోనూ ఏకకాలంలో కొనసాగారు. వాస్తవానికి ఈయనకు ఏవో పోస్టుకు మాత్రమే అర్హత ఉంది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో మూడు పోస్టుల్లోనూ కొనసాగారు. ఎన్నికల కోడ్ వచ్చాక మాత్రమే ఆయన్ను ఆ పోస్టులో నుంచి తప్పించగలిగారు. అప్పుడు కూడా ఎంపీడీవోగా కాకుండా షైనార్టీ కార్పొరేషన్ ఈడీగా జిల్లా పోస్టులో కూర్చొబెట్టారు. ఈయన గురించి మొత్తం తెలిసినా, పెద్దిరెడ్డి వెనుక ఉన్నారనే కారణంగా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేకపోయారు.

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.



ప్రభాకర్‌రెడ్డి

సుదీర్ఘంగా శాసించిన వైనం

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జడ్పీలో హవా మాత్రం ప్రభాకర్‌రెడ్డిదే. దీంతో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. జడ్పీలో ఆయన అనుభవించని పదవంటూ లేదనే చెప్పాలి. 2008 నుంచి 2017 వరకు పదేళ్ల పాటు జడ్పీలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2017లో ఎంపీడీవోగా పదోన్నతితో బైరెడ్డిపల్లెకి బదిలీ అయ్యారు. అయినా, డిప్యుటేషన్‌పై మళ్లీ జడ్పీకి వచ్చి ఓఎస్డీగా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను ఆపేవారే లేకుండా పోయారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో ఏక కాలంలో జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన ఘనత అయనది. ఆ సమయంలో జడ్పీని ఆయన కనుసన్నల్లో శాసించారు.

ఉద్యోగులపై వేధింపులు

జూనియర్ మోస్ట్ ఎంపీడీవో జడ్పీ సీఈవో ఏంటని ప్రశ్నించిన ఒక్కో అధికారిని వేధించడం మొదలుపెట్టారు. కిందిస్థాయి రికార్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీవో వరకు ఎవరినీ వదిలి పెట్టలేదు. ఆయన మాటకు ఎదురు చెప్పిన వారందరినీ ఒక ఆట ఆడుకున్నారు. రాత్రిళ్లు 11 గంటల వరకు కార్యాలయంలో ఉంచి పని చేయించేవారు. ప్రభాకర్‌రెడ్డి వేధింపుల కారణంగా జిల్లాలోని నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ప్రాణాలు కోల్పోయారని సాక్షాత్తు జడ్పీ ఉద్యోగులే పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతలే టార్గెట్‌గా బిల్లుల పెండింగ్

టీడీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్ని ఈయన మంజూరు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీని కారణంగా అప్పులకు వడ్డీలు పెరగడంతో కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక టీడీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లను ఆయన టార్గెట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో వీరికి ఒక్క బిల్లు కూడా మంజూరు చేయలేదు. అప్పులకు వడ్డీలు కట్టలేక అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆర్డర్లను కూడా లెక్క చేయకుండా బిల్లుల్ని నిలిపేశారు. కోర్టు కేసులు కోసం రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చిందని కాంట్రాక్టర్లు, సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

భారీగా జడ్పీ నిధుల దుర్వినియోగం

ప్రభాకర్‌రెడ్డి హయాంలోనే జడ్పీలో భారీఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాల సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. 2005 నుంచి 2014 వరకు బీఆర్‌జీఎఫ్ నిధులు, 2005 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘం నిధులు ఏటా జడ్పీకి మంజూరయ్యాయి. ప్రభుత్వ ఖాతాలకు జమయ్యే ఈ నిధుల్ని ప్రభాకర్‌రెడ్డి సేవింగ్స్ ఖాతాలకు మళ్లించేవారని, వడ్డీ డబ్బులే రూ.వంద కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆ వడ్డీ డబ్బుల్ని ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా సొంతానికి, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అవసరాలకు వాడినట్లు ఆరోపణలున్నాయి.

సుదీర్ఘ పోరాటం : జడ్పీలో పనిచేసిన విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, చిత్తూరు రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేత కాండ్ర రమేష్‌నాయుడు జడ్పీలోని అక్రమాల గురించి కొన్నేళ్లుగా పోరాడుతూ.. సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వీరికి తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత చంద్రప్రకాష్, సురేంద్రకుమార్ తదితరులు ఇటీవల కుప్పంలో సీఎం చంద్రబాబుకు, ఆయన సెక్రటరీ ప్రద్యుమ్నకు ప్రభాకర్‌రెడ్డి మీద ఫిర్యాదు చేశారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కూడా ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. కనకరాజులు నాయుడు మాత్రం ప్రభాకర్‌రెడ్డి అవినీతి గురించి సాక్ష్యాలు సంపాదించడంలో ముఖ్య భూమిక పోషించారు.

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు తమిళనాట నో ఎంట్రీ

- తడనుంచి పికప్ వ్యాన్లలో చెన్నైకి ప్రయాణికుల తరలింపు
- ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లను ఒప్పుకోని తమిళనాడు అధికారులు
- కేసుల భయంతో తడ నుంచే రాకపోకలు సాగిస్తున్న బస్సులు
- పర్మిట్లు లేకుండా దర్జాగా తడకు వచ్చి వెళ్తున్న పికప్ వ్యాన్లు



తడ కరిపేటి కాలువ సమీపంలో నిలిచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

తడ, జూన్ 27 : ప్రైవేట్ బస్సులకు ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లపై తమిళనాడు ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దీంతో ఆ బస్సుల్లో ప్రయాణికులు తడ నుంచి చెన్నైకి పికప్ వ్యాన్లలో రాకపోకలు సాగించాల్సివస్తోంది. చెన్నై నుంచి తడ మీదుగా హైదరాబాదు, వైజాగ్, విజయవాడ ప్రాంతాలకు సుమారు 75కు పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.ఆలిండియా పర్మిట్ ద్వారా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల పేరుతో ఇవి ఎక్కడైనా ప్రయాణించే అవకాశం ఉంది. అయితే తమిళనాడు, ఏపీ, తెలంగాణా పరిధిలో ప్రయాణించే చాలా బస్సులు ఆయా రాష్ట్రాల్లో పర్మిట్లు పొందకుండా ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాకపోకలు సాగిస్తున్నాయి.ఈశాన్య రాష్ట్రాలలో పర్మిట్ పన్నుల వసూళ్లు తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏపీలో ఒక బస్సు సీట్‌కు 3 నెలల కాల వ్యవధికి సుమారుగా 3,500 రూపాయల వరకు పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండగా,తమిళనాడులో సుమారుగా 3,200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం ఒక సీట్‌కు కేవలం 400 రూపాయల లోపే పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అక్కడ పర్మిట్లు పొందుతున్నారు. పైగా ఆ రాష్ట్రాల్లో బస్సుల తనిఖీ ఉండదు. బస్సులు ఎక్కడో ఉన్నా మధ్యవర్తుల సహాయంతో కొంతసులభంగా ఆయా రాష్ట్రాల పర్మిట్లు దొరుకుతాయి. దీంతో మనరాష్ట్రంలో 40సీట్లుగల ఒక బస్సుకు 3 నెలల కాలానికి సుమారు 1.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా, అదే బస్సుకు ఈశాన్య రాష్ట్రంలో కేవలం 16వేల రూపాయలకే పర్మిట్ అందుబాటులోకి వస్తుంది. ఇలాంటి బస్సులపై తమిళనాడు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. చెన్నై నుంచి ఏపీ, తెలంగాణాలకు వెళ్లినట్లుగానే తమిళనాడులోని వివిధ ప్రాంతాలతోపాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వందల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.ఇటీవల ఒడిశా, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పర్మిట్ పొందిన బస్సులపై తమిళనాడు ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. తమిళనాడు పర్మిట్లు సైతం పొందాలంటూ మెలిక పెడుతోంది. దీంతో ఆయా బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. చెన్నై నుంచి తడ మీదుగా రాకపోకలు సాగించే ఈ ప్రైవేట్ బస్సులను తడ వద్దే నిలిపివేసి పికప్ వ్యాన్ల ద్వారా ప్రయాణికులను అటుఇటు తరలిస్తున్నాయి.

పర్మిట్ లేకున్నా దర్జాగా రాకపోకలు

ఏపీలో రవాణాశాఖ చెక్‌పోస్టులను గత మార్చి నెలలో ప్రభుత్వం మూసివేసింది. తద్వారా వాహనాలు తనిఖీ చేసే అధికారులు లేకపోవడంతో కొందరు వాహనదారులు పర్మిట్లు లేకుండానే మనరాష్ట్రంలోకి వచ్చి వెళ్లిపోతున్నారు.ముఖ్యంగా శ్రీసిటీ, నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ వరకు వందల సంఖ్యలో వాహనాలు పర్మిట్లు లేకుండానే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సైతం ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. ఏపీలోకి పర్మిట్లు లేని పికప్ వ్యాన్లలో ప్రయాణికులను తడ-చెన్నైల మధ్య తరలిస్తున్నాయి. ఓ పక్క ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా తాజాగా పర్మిట్లు లేని ఈ పికప్ వ్యాన్లు సైతం వచ్చి వెళ్తూ మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పైగా ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి పూర్తిస్థాయిలో బస్సు చార్జీలను వసూలు చేస్తూ చెన్నై- తడ మధ్య పికప్ వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇకనైనా రవాణాశాఖ అధికారులు పర్మిట్‌లేని పికప్ వ్యాన్లపై చర్యలు తీసుకోవడమేకాకుండా తమిళనాడు తరహాలో ఈ బస్సుల నుంచి పర్మిట్ల రూపేణా పన్నులు వసూలు చేయాల్సివుంది.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ఆయన ఆరునెలల పాటు లేదా కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించేంత వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు సహకార సంఘాలకు గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నాన్-అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సెవెన్‌మెన్ కమిటీలు ఈనెల 8వ తేదీన, చైర్‌పర్సన్లు ఎస్.రెడ్డెమ్మ, ఎస్.నాగలక్ష్మిలతో సహా సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో పాలకవర్గాలు రద్దయ్యాయి. అప్పట్నుంచి రెండు సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ఇక అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి నియామకంతో కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.58 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సూళ్లూరుపేట, జూన్ 27: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సహాయ కమిషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భక్తులు హుండీలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం 105 రోజులకుగాను రూ.58,51,539 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ తెలిపారు. ఇవే కాకుండా యుఎస్ఏకు చెందిన డాలర్స్ 27, యుఏఈ దిర్హామ్స్ 5, మలేషియా రిగ్గింట్-1, సింగపూర్ డాలర్ 10, ఇంగ్లాండ్ ఫౌండ్ 5తోపాటు 45 గ్రాముల బంగారు, వెండి 120 గ్రాములు హుండీలో కానుకలో రూపంలో భక్తులు వేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంత బ్యాంకు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



తడ, జూన్ 27 : పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు సమక్షంలో ఈ నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. తడ బాలికోన్నత పాఠశాలలో 14 మందికి, బాలుర ఉన్నత పాఠశాలలో ఒకరికి, చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో ఒకరు, వాటంబేడు పాఠశాలలో ఇద్దరికి, ఆదర్శ పాఠశాలలో 9 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు 5,116 రూ, 4116రూ, 3116రూ, మిగిలిన వారికి రూ.2,116, రూ.1,116 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్, ఆలపాటి అశోక్‌కుమార్, రత్నబాలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జూన్ 26: కార్యకర్తలకు అండగా ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అభ్యర్థులు ఇప్పటి వరకు కలిసే పోరాటాలు చేస్తున్నామన్నారు. ఓటమికి కారణాలు పరిశీలించుకుని సరిదిద్దుకుంటామని తెలిపారు. అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదరించిన పార్టీకి అన్యాయం చేయకుంటే మంచిదని స్పష్టం చేశారు. ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, మాజీ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి

● ఎమ్మెల్యే విజయశ్రీకి వినతి



ఎమ్మెల్యే విజయశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న అనూరాధ

నాయుడుపేట, జూన్ 27 : దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలగకుండా వారికి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ ఉమ్మడి నెల్లూరు జిల్లా మాజీ మెంబరు మాలేపాటి అనూరాధ అన్నారు. నాయుడుపేటలో గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి అభినందించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో మొట్టమొదటి మహిళా ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలవడం నియోజకవర్గ చరిత్ర అన్నారు. వారి వెంట పెళ్లకూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రరెడ్డి ఉన్నారు.

వెంకటగిరిలో పారిశుధ్యం అధ్వానం



వెంకటగిరి, జూన్ 27 : వెంకటగిరిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మున్సిపల్ సిబ్బంది కాలువల్లో పూడిక తీసి రోడ్లపై పడేసి రోజులు తరబడి తొలిగించకుండా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ, తోలిమిట్ట తదితర లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. కాలువల్లో పూడికతీస్తే రోజులు తరబడి వాటిని తొలగించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై పేరుకు పోతున్న చెత్తను తొలిగించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



వాకాడు, జూన్ 27 : తాము చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత మేలుచేయాలని మండలంలోని ఎస్ఎఎల్‌సీఈఎఫ్ వాకాడు పాఠశాల 1999 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ముందుకొచ్చారు. పదోతరగతిలో ప్రతిభ చాటిన మంజుషాకు రూ.20 వేలు, ద్వితీయ బహుమతి కీర్తికి రూ.15 వేలు, తృతీయ బహుమతిగా లోకేష్‌కు రూ.10వేలు చొప్పున అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి నసీం ఆలీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇప్పటికే పాఠశాలకు ఫర్నీచర్‌ను అందజేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుగు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



కోట, జూన్ 27 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 8వ రోజు అయిన గురువారం ఎన్‌సీసీ క్యాడెట్‌లు, కమాండెంట్‌లు మొక్కలునాటి నీళ్లుపోశారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో నాల్గవ వార్షిక శిబిరం జరుగుతూ పలు జిల్లాల నుంచి 640 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు గేమ్స్, స్పోర్ట్స్, గన్ ఫైరింగ్, పెరేడ్ ట్రైనింగ్ తదితర అంశాలపై శిక్షణ పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కళాశాల ఆవరణతోపాటు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, గుండాల నరేంద్రబాబు, నాగేంద్ర, ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఉన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో నిర్లక్ష్యం సహించం

కోట, జూన్ 27 : స్త్రీనిధి రుణాల రికవరీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని స్త్రీనిధి మేనేజర్ జయకుమార్ హెచ్చరించారు. కోటలోని వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో గురువారం వీవోఏలతో స్త్రీనిధి రుణాల రికవరీపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యానికి మించి స్త్రీనిధి రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యమన్నారు. మలివిడత రుణాలు పొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం సీహెచ్ రత్నయ్య, సీసీలు కృష్ణ, శ్రీకాంత్, ప్రసాద్, శంకరయ్య, భాస్కర్, కృష్ణమ్మ, బిందు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెళ్లకూరు, జూన్ 27 : మండలంలోని పుల్లూరు, కలవకూరు గ్రామ సమీపంలో స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావు దాడులు చేసి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కలవకూరు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సీఐ తన సిబ్బందితో దాడులు చేసి రెండు ట్రాక్టర్లను, ఇద్దరు డ్రైవర్లను పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

గురుకులంలో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలు

చిల్లకూరు, జూన్ 27: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతులలో మిగులు సీట్ల భర్తీకి గురువారం ఆ పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 225 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 183 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మీరాసాహెబ్ తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దొరవారిసత్రం, జూన్ 27 : దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరై మాట్లాడుతూ దొరవారిసత్రం మండలంలో ఆగిపోయి ఉన్న తెలుగు గంగ కాలువ పనులు పూర్తి చేయించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏవోలు కవిత, కాంచన, జ్యోతిర్మయి, ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, ఉప మండలాధ్యక్షుడు దువ్వూరు గోపాల్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంఈవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



నాయుడుపేటటౌన్, జూన్27 : నాయుడుపేట మండలం బిరదవాడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని గురువారం టీడీపీ జిల్లా కార్యదర్శి బిరదవాడ నారాయణ, ప్రధాన కార్యదర్శి నానాబాల సుబ్బారావు, పట్టణ కార్యదర్శి మల్లాం రవికుమార్ అందజేశారు. విద్యకు తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూళ్లూరుపేట, జూన్ 27: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అలవల రోటరీ కంటి వైద్యశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాత టైనీటాట్స్ పాఠశాల కరస్పాండెంట్ వేనాటి ధనుంజయ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 65 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి పంపుతామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అట్రంబాకం దశరథరెడ్డి తెలిపారు డాక్టర్ సాయిబాబా, వేనాటి విజయలక్ష్మి, సుంకర ప్రతిమ, కొండా అర్చన, ఎస్.శ్రీరాములు యాదవ్, కొండా రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి నెలవల పరామర్శ

ఓజిలి, జూన్27: ఓజిలి మండలం అత్తివరానికి చెందిన టీడీపీ నాయకుడు కనుమూరు గోపాల్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రెడ్డి సోదరుడు చిరంజీవిరెడ్డి మృతి చెందాడు. దీంతో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మధురెడ్డి, కట్టా రమణారెడ్డి, బి. రవీంద్రారెడ్డి ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం తగదు

కోట, జూన్ 27 : గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత హెచ్చరించారు. మండల పరిధిలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సెక్టార్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల బరువు, ఎత్తు, కొలతలు తీస్తూ ఉండాలన్నారు.

గురుకుల ప్రవేశాల్లో అవకతవకలపై చర్యలు తీసుకోండి

డక్కిలి, జూన్ 27 : జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఖాళీల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ఖాళీలకు గురువారం 6,7,8,9 తరగతులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షల నిర్వహణలో అనేక చోట్ల అవకతవకలు చోటు చేసుకొన్నాయని ఆరోపించారు. డక్కిలి గురుకుల పాఠశాలలో దరఖాస్తులు స్వీకరించి కూడా 7,8 తరగతులకు పరీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 27 : రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్లు కరెంటు ఫ్రీగా ఇస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 4వ వార్డులో చేనేతలకు సబ్సిడీపై మంజూరు అయిన స్టాండు మగ్గాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీలు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తూచా తప్పకుండా అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

● నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇటీవల తన భర్తను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ హతుడు బొక్కిసం రవి భార్య మునెమ్మ ఎమ్మెల్యే రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. తన భర్త హత్యతో తాను, తన ఇద్దరు పిల్లలు అనాథలయ్యామని ఆమె కన్నీటి పర్యంతం మయ్యారు. దీంతో చలించిన రామకృష్ణ పిల్లలను ఎన్‌టీఆర్ ట్రస్టులో చేర్పించి వారిని ఉన్నత చదువులు చదివించే బాధ్యతను తాను తీసుకొంటానని ఆమెకు హామీ ఇవ్వడంతో పాటు మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి ఆమె విద్యార్హతకు తగిన ఉపాధి అవకాశం కల్పించాలని సూచించారు. రవిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

● చిన్నారికి ఎమ్మెల్యే అభినందనలు

రాష్ట్ర, జాతీయ స్థాయి విలు విద్య పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించిన 4వ వార్డుకు చెందిన 4వ తరగతి విద్యార్థి గీర్వాణ్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో చేనేత శాఖ అధికారులు విశ్వేశ్వరరావు, డిల్లీబాబు, మున్సిపల్ కమిషనర్ రషీద్, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, గొల్లగుంట మురళీకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, జింకా బాలసుబ్రమణ్యం, పెద్ద వెంకటముని, మంకు ఆనంద్, 3వ వార్డు కౌన్సిలర్ పొట్టేళ్ళ ప్రభావతి, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు వున్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 27 : వెంకటగిరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు సూచించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన ఇరిగేషన్, తెలుగుగంగ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా వున్న తెలుగుగంగ బ్రాంచి కాలువ లు మరమ్మతులతో పాటు తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి గతంలో ప్రతిపాదించిన ప్రాంతాల్లో తూములు ఏర్పాటుకు మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈ రాధాకృష్ణను కోరారు. అంతేకాకుండా ఇరిగేషన్ అధికారులతో చెరువుల స్థితిగతులపై చర్చించారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన పనుల వివరాలను తెలిపాలని కోరారు.. రోడ్ల దుస్థితి తెలుసుకొన్న ఎమ్మెల్యే రోడ్ల మర్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ శాఖ అధికారులకు చెప్పారు కార్యక్రమంలో తెలుగుగంగ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల ఈఈ, డీఈ, జేఈలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : పాశిం



ఎస్టీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 27: గురుకుల పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చెన్నూరులోని ఎస్టీ గురుకుల పాఠశాలను సందర్శించి వసతుల గురించి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్టీ గురుకుల పాఠశాలలో కలుషిత నీటి సరఫరా కారణంగా విద్యార్థులు అస్వస్థతకు లోనైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారన్నారు. స్థానిక టీడీపీ నాయకులను పంపి విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ఛాన్‌బాషా, వెంకటేశ్వర్లురాజు, మట్టం మురళి, పిట్టి నాగరాజు, మల్లికార్జున్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు కరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదన్, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఎమ్మెల్యే పూజలు

గూడూరు అర్బన్ : చెన్నూరులోని పోలేరమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమలో భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధురెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ



వార్డెన్‌లతో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట, జూన్ 27 : వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల వార్డెన్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, సొంత భవనాలు, అద్దె భవనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల మరమ్మతులు, నూతన వసతి గృహాల ఆవశ్యకత గురించి తెలియజేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలన్నారు.

నాయుడుపేట టౌన్ : ఎల్ఏ సాగరంలోని ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, గూడూరు సుధీర్‌రెడ్డి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్, ఎంఈఓ బాణాల మునిరత్నం, హెచ్ఎం అన్నామణి, ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రమేష్, సూర్యారావు, శైలజ, స్నేహలత తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థులచే ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

సూళ్లూరుపేట, జూన్ 27: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంఈవో శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం సూళ్లూరుపేటలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులచే బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు వీలుందన్నారు. అనంతరం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి పట్టణ వీధుల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శీనయ్య, ప్రధానోపాధ్యాయుడు శేఖర్, సీఆర్‌పీ అంకయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డక్కిలిలో 'నేను బడికి పోతా'

డక్కిలి, జూన్ 27 : బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్చే విధంగా తల్లిదండులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ర్యాలీ నిర్వహించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి జులై 12వ తేదీలోగా బడిలో వుండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బడిఈడు పిల్లల చేత పనులు చేయించడం చట్టరీత్యా నేరం అని ఎంపీడీవో లీలామధురి అన్నారు. ఈ ఎంఈవోలు పిన్నక జగదీష్ బాబు, కిల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలి

కోట, జూన్ 27 : జూలై 1వ తేదీ నుంచి పింఛన్ల నగదును నేరుగా ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఎంపీడీవో శంకరయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి సగటున సచివాలయ ఉద్యోగి 50 మంది లబ్ధిదారులకు మించకుండా కేటాయించామన్నారు. మండలంలో 7,156 మందికి వివిధ రకాలు పింఛన్లు ఉన్నాయన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఐ



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, జూన్ 27: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నాయకులు గురువారం ఆర్డీవో చంద్రమునికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు మోదుగుల పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వమే గిట్టుబాటు ధర నిర్ణయించి రైతుల వద్ద నేరుగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో రూ. 2లక్షల ఉన్న బీమాను రూ. 3లక్షల వరకు పెంచి పెట్టుబడి రాయితీ కింద రుణాలు సకాలంలో అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువులు, వ్యవసాయ పనిముట్లను 50 శాతం సబ్సిడితో అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, బాలయ్య, ప్రభుదాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్‌కు ఘన నివాళి



సూళ్లూరుపేట, జూన్ 27: దివ్యాంగుల ఆశా జ్యోతి హెలెన్ కెల్లర్ 144వ జయంతి వేడుకలను పురష్కరించుకొని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సూళ్లూరుపేట అధ్యక్షురాలు నాదెండ్ల శాంతికుమారి ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ముందుగా భవిత కేంద్రంలో హెలెన్ కెల్లర్ చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాపూజి కాలనీకి చెందిన దివ్యాంగుడు తుపాకుల చంద్రయ్యకు నెలకు సరిపడా సరుకులు, రూ.4 వేల ఆర్థికసాయాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర టీచర్ భార్గవి, సూర్య, శివ, పోలయ్య, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్న దర్గా ఉరుసు



ఉరుసుకు ముస్తాబైన చిన్నదర్గా

నాయుడుపేట, జూన్ 27 : నాయుడుపేట చిన్నదర్గా వీధిలో వెలసిన చిన్నదర్గా ఉరుసు శుక్రవారం తెల్లవారుజామున గంధోత్సవంతో ప్రారంభం కానుంది. చిన్న దర్గా గంధోత్సవాన్ని హిందువులు, ముస్లింలు కలసి ఐక్యమత్యంగా చేసుకోవడం దాదాపు 40 సంవత్సరాల నుంచి వస్తున్న ఆనవాయితీ. ప్రత్యేక పూజలనంతరం గంధాన్ని హిందు, ముస్లింలకు పంచిపెడుతారు. ఆ గంధాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరిస్తారు. మంగళవాయిద్యాలతో జెండాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. ఆ జెండాలను చిన్నదర్గాలో అమరుస్తారు. భక్తులు ఆ జెండాలకు మొక్కులు కోరుకుంటారు.



చిన్నదర్గా వద్ద విద్యుత్ దీపాలంకరణ